రుచి.. శుచి

ఖైదీలకు నాణ్యమైన ఆహారం..
మెనూలో మార్పులు



వివరాలు 6లో...

అధనపు బాధ్యతలు..?

- ఓ ఉన్నతాధికారి అడ్డగోలు వ్యవహారం
- నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు
- ఒక్కో వార్డెన్‌కు మూడేసి వసతిగృహాల అప్పగింత
- సంక్షేమ వసతిగృహాల పర్యవేక్షణ గాలికి..
- ఆరోపణలొచ్చినా చర్యలకు మీనమేషాలు
- ముడుపుల వ్యవహారమే కారణమా..?
- శ్రీసత్యసాయి జిల్లాలో గాడితప్పిన బీసీ వసతి గృహాల పాలన



వివరాలు 6లో...

యూరియా.. దోపిడీ

- ఒక్కో లారీకి అదనంగా రూ.10 వేలు వసూలు
- పలు కంపెనీల ప్రతినిధుల నిర్వాకం
- కొందరు కీలక అధికారులతో కుమ్మక్కు
- రైతులకు తప్పని భారం



వివరాలు 7లో...

'గీత' కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు



మద్యం షాపులకు లాటరీ తీస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం జిల్లాలోని కల్లుగీత కార్మికులకు 9 మద్యం షాపులు రిజర్వు చేస్తూ ఇటీవల నోటిపికేషన్ ఇచ్చింది. అందులో భాగంగా వారికి సోమవారం లాటరీ పద్ధతిలో మద్యం షాపులు కేటాయించారు. స్థానిక సాయి ఆరామంలో నిర్వహించిన లక్కీ డ్రాలో కలెక్టర్ టీఎస్ చేతన్ దుకాణాలు కేటాయించారు. జిల్లాలోని 9 మద్యం దుకాణాలకు గాను ఏడు దుకాణాలు ఈడిగ కులస్థులు, గౌడు, గౌడా కులస్థులకు ఒక్కొక్క షాపు చొప్పున కేటాయించారు. 9 షాపులకు 59 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ దరఖాస్తులదారుల సమక్షంలో లాటరీ తీసి మద్యం షాపులను కేటాయించారు. హిందూపురం మున్సిపాలిటీ షాపునెంబర్ 88(ప్రశాంత్‌గౌడ్), హిందూపురం రూరల్ షాపు 91(ఈడిగ హనుమయ్య), ధర్మవరం మున్సిపాలిటీ షాపు 89(శ్రీశైలం పురుషోత్తమగౌడ్) కదిరి మున్సిపాలిటీ షాపు 90(ముట్ల మనోహర్, చిలమత్తూరు షాపు 92(రజిత), పెనుకొండ రూరల్ మండలం షాపు 93(ఈడిగ కుమార్), తాడిమర్రి షాపు 94(భాస్కర్ గౌడ్), పుట్టపర్తి రూరల్ షాపు 95(ఈడిగ శ్యామల), నంబులపూలకుంట షాపు 95(ఆదిమూలం సౌజన్య)ను లాటరీ ద్వారా కేటాయించారు. మూడు మద్యం షాపులు మహిళలకు దక్కడం విశేషం. ఈకార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి గోవిందునాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ నరసింహులు, పలు ఎక్సైజ్ సీఐలు, అధికారులు పాల్గొన్నారు.

14 నుంచి అతిరుద్ర మహాయజ్ఞం



వాస్తుపూజ చేస్తున్న ఆర్జే రత్నాకర్ దంపతులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): లోకరక్షణం, విశ్వశాంతి కోసం ఈనెల 14 నుంచి స్థానిక ప్రశాంతి నిలయంలో అతిరుద్ర మహా యజ్ఞం చేయనున్నారు. అందుకు సంబంధించి సోమవారం సాయికుల్వంత్ సభా మండపంలో వేదపండితులు వాస్తు పూజ నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ దంపతులు వాస్తు పూజలో పాల్గొన్నారు. హోమ గుండానికి ఉపయోగించే ఇటుకలకు పూజలు నిర్వహించారు. యజ్ఞం కోసం ట్రస్టు వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాయి. 12 రోజుల పాటు నిర్వహించే యజ్ఞంలో వందల కొద్ది ఆధ్యాత్మిక, తత్వవేత్తలు పాల్గొననున్నారు. యజ్ఞంలో పాల్గొనడానికి భక్తులు సైతం వేల సంఖ్యలో రానున్నట్లు తెలిసింది.





చెరువుల దాహం

చుక్కనీరు కూడా చేరని తూర్పు చెరువు

తాడిమర్రి చెరువులకు అందని పీఏబీఆర్ నీరు
కుడి కాలువ ద్వారా నీటి విడుదల అంతా ఉత్తిదే
ఆందోళనలో చీనీ, దానిమ్మ రైతులు

తీరేనా...?

తాడిమర్రి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా వచ్చే నీరు చెరువులకు చేరకపోవడంతో మండల రైతులు ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా కుడికాలువ ద్వారా నీరు విడుదల చేసినప్పుడు ప్రధాన కాలువలోనూ, పిల్ల కాలువల్లోనూ పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడిక, కంపచెట్లను తొలగించాల్సి ఉంటుంది. ఈ ఏడాది అలాంటి పనులు చేయకుండానే అధికారులు నీరు విడుదల చేశారు. ముందుగా అగ్రహారం చెరువుకు ఆ తరువాత తాడిమర్రి పడమటి, తూర్పు చెరువులకు నీటిని విడుదల చేయాల్సి ఉంది. అయితే అగ్రహారం చెరువులోకి నీరు చేరగానే ఆపేసి పై చెరువులైన తాడిమర్రి చెరువులకు నీరు ఇచ్చే పనికి అధికారులు పూనుకున్నారు. మూడు రోజులపాటు చెరువులకు నీరు వదిలినా కాలువపై గస్తీ లేకపోవడం, అధికారులు తూతూ మంత్రంగా పర్యవేక్షించడం వల్ల నీళ్ల తాడిమర్రి చెరువులకు కాకుండా బి.పప్పూరు, ఏకపాదంపల్లి చెరువులకు వెళ్లిపోయాయి. ఇక పుల్లప్పల్లి చెరువుకు అంతంతా మాత్రమే. పిన్నదరికి అసలు నీరే చేరలేదు. అయితే పిన్నదరి గ్రామస్థులు మాత్రం తమ గ్రామాన్ని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దత్తత తీసుకున్నారు కాబట్టి తప్పక నీరు వస్తుందని ఆశగా ఉండగానే నీటిని ఆపేశారు. ఇప్పుడు మంత్రి ఆదేశాలతో బత్తలపల్లి చెరువుకు, తాడిమర్రి మండలంలోని నారసింపల్లి చెరువుకు పూర్తిస్థాయిలో నీరు ఇచ్చేందుకు అధికారులు వారం రోజులుగా కాలువలోకి నీరు వదిలారు. అదే పద్ధతిలోనే మంత్రి దత్తత గ్రామమైన పిన్నదరికి నీరు ఇవ్వాలని ఆ ఊరి ప్రజలు కోరుతున్నారు. తాడిమర్రి మండలంలో ఎక్కువ విస్తీర్ణంలో చీనీ, దానిమ్మ, అరటి పంటలు సాగులో ఉన్నాయి. నీటి ఎద్దడి మొదలైతే ఆ రైతుల కష్టాలు తీర్చడం ఎవరి వల్ల కాదు. లక్షల రూపాయలు నష్టపోయే ప్రమాదం ఉంది. అధికారులే ముందస్తు చర్యలు చేపట్టిన నీరు ఇచ్చే ఏర్పాట్లు చేయాలి.



పడమటి చెరువు

అదనపు కోటాలో మిగిలితే నీరు ఇస్తాం

ప్రస్తుతం పీఏబీఆర్ కుడికాలువ ద్వారా వస్తున్న అదనపు కోటాలో నీరు మిగిలితే పై అధికారుల ఉత్తర్వుల మేరకు దిగువకు నీరు అందించే అవకాశం ఉంది. తాడిమర్రి చెరువులకు పాత పద్ధతిలోనే నీరు ఇచ్చేందుకు ప్రయత్నిస్తాం. ఇప్పటికే తాడిమర్రి తూర్పు, పడమర చెరువులకు నీరు వెళ్లని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- రాధాకృష్ణ, డీఈఈ

మంత్రి నీరు ఇప్పిస్తారనే నమ్మకం ఉంది



మా గ్రామాన్ని మంత్రి సత్యకుమార్‌యాదవ్ దత్తత తీసుకున్నారు. మా గ్రామానికి అవసరమయ్యే పనులను గుర్తించే పని ప్రారంభించారు. ఇప్పుడు చెక్ డ్యాంలకు కుడి కాలువ ద్వారా నీరు ఇచ్చే ఏర్పాట్లు చేయాలి. బత్తలపల్లి, నారసింపల్లి చెరువులు నిండిన తరువాత మా చెరువులకు, చెక్‌డ్యాంలకు నీరు ఇప్పిస్తారని అనుకుంటున్నాం.

-విశ్వనాథ్, మాజీసర్పంచ్, పిన్నదరి

నీటి ఎద్దడి తలెత్తితే.. కష్టమే



నేను ఐదెకరాలో దానిమ్మ పంట సాగుచేస్తున్నా. నీటి ఎద్దడి వచ్చిందంటే ఇక తట్టుకోవడం కష్టమే. ఇక చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుని చెట్లను బతికించుకోవాల్సి వస్తోంది. నీరు ఇవ్వండి మహాప్రభో అంటూ అధికారుల చుట్టు తిరిగినా ఫలితం లేకుండాపోయింది.

-శంకర్, రైతు, మేడిమాకుల పల్లి

ఇప్పటికే నీరు తగ్గింది



ఎండాకాలం మొదలే కాలేదు. అప్పుడే బావులలో నీరు తగ్గిపోతోంది. వర్షాలు వచ్చేలోపు బావులు, బోర్లు ఏమైపోతాయో తెలియడం లేదు. చీని చెట్లు మంచి కాపులోఉన్నాయి. ఇప్పుడు చెట్లకు నీరు అధికంగా కావాల్సి ఉంటుంది.

-వెంకటరాముడు, రైతు, తాడిమర్రి

13న గోరంట్లలో జాబ్ మేళా

గోరంట్ల, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎన్‌కే డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన టెన్త్, డిగ్రీ, పీజీ చదివిన 18నుంచి 35 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. 6 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆసక్తిగల వారు బయోడెటా, ఆధార్, విద్యార్హత పత్రాలతో 13న ఉదయం 9గంటలకు కళాశాలలో హాజరు కావాలన్నారు.

ఉష్ణోగ్రతలు



గరిష్ఠం 32.0 | కనిష్ఠం 17.0

ఇళ్ల స్థలాల కోసం ఆందోళన



తహసీల్దార్ ఆఫీసు వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల కోసం సీఐటీ యూ ఆధ్వర్యంలో పట్టణంలోని అమీన్‌నగర్‌కు చెందిన ప్రజలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అమీన్‌నగర్ ప్రాంతాలో చాలా మంది పేదలున్నారని, వారికి సొంత స్థలాలు, ఇళ్లు లేక బాడుగ ఇళ్లలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం పలుమార్లు అధికారులకు దరఖా స్తులు చేసుకున్నా పట్టించుకోలేదన్నారు. ఏళ్ల తరబడి బాడుగలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ సాంబశివ, నారాయణ, ఐద్వా మహిళ సంఘం లక్ష్మీనరసమ్మ, సుగుణ, సాధియా పాల్గొన్నారు.

- తాడిమర్రి : పేదలకు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కమతం కాటమయ్య, వ్యవసాయ కార్మికసంఘం కార్యదర్శి లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం తాడిమర్రిలో సమావేశం ఏర్పాటు చేసుకుని ఇళ్లు లేని పేదల వివరాలు సేకరిం చారు. 10 సంవత్సరాలుగా నివాసముంటున్న ఇళ్లకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. పెద్దన్న, చౌడప్ప, నాగభూషణం పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై మానవతా దృక్పథంతో
వ్యవహరించాలి..

- కలెక్టర్ టీఎస్ చేతన్
- తక్షణమే పరిష్కారం చూపాలి: ఎమ్మెల్యే
- మడకశిరలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు భారీ స్పందన
- 458 వినతులు సమర్పించిన ప్రజలు



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మడకశిర, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని వ్యవసాయ గోదాములో సోమవారం నియోజకవర్గ స్థాయి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జేసీ అభిషేక్ కుమార్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ చేతన్ పాల్గొని ప్రజల నుంచి 458 వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. అర్జీలను గడువులోగా పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో పలు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయన్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో నివేదికలు సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ వివరించారు.

తక్షణమే పరిష్కారం చూపాలి..
ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

నియోజకవర్గం ప్రజలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్న లక్ష్యంతో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి, అర్జీలు సమర్పించారు.

జగన్ పాలనలో విద్యుత్ వ్యవస్థ నిర్వీర్యం

- 9 గంటల కరెంటు సరఫరా ఉత్తమాటే
- 7 గంటలకే కుదింపు
- కూటమి ప్రభుత్వంలో వ్యవసాయానికి పెద్దపీట
- ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

కొత్తచెరువు/ ఓబుళదేవర చెరువు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేశాడని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువు, ఓబుళదేవరచెరువులోని ట్రాన్స్‌కో కార్యాలయాల్లో సోమవారం రైతులకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యవసాయానికి పెద్దపీట వేస్తామని చెప్పి.. అనతికాలంలోనే రైతులకు సబ్సిడీతో అందే అన్నింటినీ రద్దు చేశారన్నారు. వ్యవసాయానికి 9 గంటల కరెంటును ఏడు గంటలకే కుదించారని విమర్శించారు. వ్యవసాయ పనిముట్లు, డ్రిప్పు, స్ప్రింక్లర్లను అందించలేక చేతులెత్తేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో పథకాలతోపాటు రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లు వ్యవసాయ పరికరాలను అందిస్తున్నారు. వ్యవసాయానికి 9గంటలు కరెంటు సరఫరా చేసేందుకు శ్రీకారం చుట్టారన్నారు. గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఏళ్ల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఉండేదనీ, ప్రస్తుతం రైతు డీడీకట్టిన వెంటనే మంజూరవుతున్నాయన్నారు. అందులో భాగంగా కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల్లోని 40 మంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కాగా.. వాటిని అందజేశారు. అనంతరం కొత్తచెరువులో నిర్మించిన ఏఈ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈ శివరాం, ఏడీలు ఓబులేసు, రామసూరారెడ్డి, ఏఈలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొత్తచెరువులో రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె



విద్యుత్ కోసం రైతుల ఆందోళన

అగళి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రోజుకి ఐదారు గంటలు కూడా రైతులకు విద్యుత్ సరఫరా చేయడం లేదని టీడీపీ మాజీ ఎంపీపీ రామకృష్ణ, సర్పంచ్ రామకృష్ణప్ప, పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని హెచ్‌డీ హళ్లి సబ్‌స్టేషన్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. రోజుకు రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తుంటే హెచ్‌డిహళ్లి సబ్‌స్టేషన్‌లో మాత్రం ఆరుగంటలే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదికూడా లోవోల్టేజీతో కూడిన విద్యుత్ సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే సబ్‌స్టేషన్ ఎదుట నాలుగైదు మార్లు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టామని అయినా పట్టించుకోవడం లేదన్నారు. ఈక్రమంలోనే సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేశారు. స్పందించిన ఏడీ రాజు రైతులు ఆందోళన చెందవద్దని, విద్యుత్ సరఫరా చేస్తామని సూచించడంతో ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో రైతులు నరసింహ, దేవరాజు, హనుమంతరాయ, శ్రీనివాసులు, శివన్న, సురేష్, రాజు, పాండు, లింగప్ప, రామాంజినాయక్, రేఖనాయక్, అలీఖాన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం

పోలీసులు కొట్టడంతోనేనని బాధితుడి ఆవేదన
కేసు కట్టారనే..: డీఎస్పీ

హిందూపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో బెల్లం నరేష్ అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. ఓ కేసు విషయమై సోమవారం విచారణకు పిలిపించారు. విచారణ అనంతరం స్టేషన్‌లోని ఓ గదిలో కూర్చుని ఉన్నాడు. ఈ సందర్భంలో స్టేషన్‌లోని మేడపై ఉన్న గదిలోని కత్తితో కడుపుపై పొడుచుకున్నాడు. అక్కడే ఉన్న సిబ్బంది గమనించి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. దీనిపై నరేష్ మాట్లాడుతూ.. పోలీసులు స్టేషన్‌కు పిలిపించి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. మనస్తాపంతో కత్తితో పొడుచుకున్నట్లు తెలిపాడు. దీనిపై డీఎస్పీ మహేష్‌ను వివరణ కోరగా.. ఈనెల 9న అర్ధరాత్రి సమయంలో డయల్ 100కి ఫోన్ చేసి, తన వాటర్ ప్లాంట్‌ను పేల్చడానికి ఎవరో నల్ల మందు తెచ్చారని సమాచారం ఇచ్చాడన్నారు. దీంతో పోలీసులు అక్కడికెళ్లి చూడగా.. కర్ణాటకలోని గౌరీబిదనూరుకు చెందిన వెంకటప్ప అనే వృద్ధుడిని చెట్టుకు కట్టేసి ఉంచడం గమనించిన పోలీసులు అతడిని విడిపించారన్నారు. వృద్ధుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సోమవారం మధ్యాహ్నం విచారించడానికి స్టేషన్‌కు పిలిపించారన్నారు. కేసు నమోదు చేశారన్న సమాచారంతో నరేష్ కత్తితో కడుపుపై పొడుచుకున్నాడన్నారు. ప్రస్తుతం ఆస్పతిరలో చికిత్స పొందుతున్నాడన్నారు.

ఆకాశ కుసుమం



935 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవరం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 935 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 465 క్యూసెక్కులు వెళుతుతున్నాయన్నారు. అదేవిధంగా 36వ ప్యాకేజీ కింద శీర్పి, బెళుగుప్ప చెరువులకు 100 క్యూసెక్కులు వెళుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

చీనీ టన్ను రూ. 23వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 23వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ .5వేలు, సరాసరి రూ. 16,400తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 43 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రుచి..శుచి

ఖైదీలకు నాణ్యమైన ఆహారం.. మెనూలో మార్పులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు జైలు జీవితాన్ని తలచుకోవడానికే భయపడిపోయేవారు. నాలుగుగోడల మధ్య ఒంటరిగా నలిగిపోవడం ఒకటైతే... ఆహారం విషయంలో మరింత కఠిన నిబంధనలు ఉంటాయని చెప్పుకునేవారు. బ్రిటిష్ కాలం నుంచి జైళ్ల శాఖలో కఠిన నిబంధనలు పాటించేవారు. ఏదైనా తప్పు చేస్తే... 'జైల్లో చిప్పకూడు తింటావ్.. జాగ్రత్త..' అనే ఊతపదం ఇప్పటికి నాణుడిలో ఉంది. జైళ్ల శాఖలో వచ్చిన నూతన సంస్కరణలతో రిమాండ్ ఖైదీలు, జీవిత ఖైదీలకు పెట్టే భోజనంలో పెనుమార్పులు వచ్చాయి. చాలా మందికి జైలులో ఉండే ఖైదీలు ఏమి తింటారన్న విషయంపై ఆసక్తి ఉంటుంది. ఈ క్రమంలోనే ఆంధ్రజ్యోతి అనంతపురం రెడ్డిపల్లి జిల్లాజైలులో కటకటాల వెనుక ఎలాంటి వంటలు చేస్తారో తెలుసుకునే ప్రయత్నం చేసింది.


వంట చేస్తున్న ఖైదీలు


జైలులో ఖైదీలకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

కొలతల ప్రకారం మెనూ

గతంలో ఖైదీలు తినే ఆహారం అధ్వాన్నంగా ఉండేది. ఉడికీ ఉడకని అన్నం... ఉప్పు, కారం లేని నీళ్ల చారు, నీళ్ల పప్పు పెట్టే వారు. తినే ప్లేట్లు కూడా దారుణంగా ఉండేవి. కాఫీ, పాలు, ఇచ్చేవారు కాదు. ఉదయం 9-30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు మాత్రమే భోజనం పెట్టేవారు. సంస్కరణల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో ఆహార శైలిని బట్టి మోనూలో మార్పులు తెచ్చారు. ఆహార నిపుణుల సూచనల మేరకు వడ్డిస్తున్నారు. ప్రతి వస్తువును సంబంధిత ఆరోగ్య ప్రమాణాలకు తగిన నిష్పత్తిలో తూకం వేస్తారు. ఉదారణకు... చపాతీల కోసం ప్రతి ఖైదీకి 400 గ్రాములు ఇస్తారు. ఆ మేరకు పరిమాణాన్ని బట్టి మూడు లేదా నాలుగు చపాతీలు ఇస్తారు. కంది, శనగ, పెసర పప్పులు 80 గ్రాములు, మటన్, చికెన్ 175 గ్రాములు, కూరగాయలు 200 గ్రాములు, పాలు 140 మి.లీ., బియ్యం 600 గ్రాములు.. ఇలా మెనూ కొలతలు నిర్ణయించారు.

రుచికరంగా వంటలు

జైలులో ఉన్న ఖైదీలే వంట వండుతారు. తోటి ఖైదీలకు ఆహారం వండే విషయంలో పరిశుభ్రతతో పాటు నాణ్యత పాటిస్తున్నారు. గతంలో జైలులో అల్పాహారం, పాలు ఇచ్చే వారు కాదు. ప్రస్తుతం జైలులో ఉదయం 7 గంటలకు పాలు, కాఫీ, టీ, 7:30 గంటలకు అల్పాహారం పెడుతున్నారు. అల్పాహారంగా.. చపాతీ, ఉప్మా, పులిహోరా, పొంగల్ పెడుతున్నారు. మధ్యాహ్నం భోజనం 11 నుంచి 12 గంటల మధ్య వడ్డిస్తారు. ఇందులో అన్నం, కాయగూరల సాంబారు, కందిపప్పు, శనగ పప్పు, పెసర పప్పు, రసం, వేపుడు, పెరుగు ఉంటాయి. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు టీ లేదా పాలు ఇస్తారు. సాయంత్రం 5-30 నుంచి 6 గంటల మధ్య మధ్యాహ్నం చేసిన కూరలు కాకుండా మోనూలో మార్పులు చేసి వండుతారు. ప్రతినెలా మొదటి ఆదివారం మటన్ కర్రీ, మిగిలిన ఆదివారాల్లో చికెన్ వడ్డిస్తారు. ప్రతి మంగళవారం కోడి గుడ్డు ఉంటుంది. దీంతో పాటు జాతీయ, రాష్ట్రానికి సంబంధించిన పండగలకు స్వీట్లు పెడతారు. తాగేందుకు మినరల్ వాటర్ సౌకర్యం కల్పించారు.

వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక ఆహారం

ఖైదీలు ఏదైనా అనారోగ్యం బారిన పడితే ప్రత్యేక మోనూ అమలు చేస్తారు. షుగర్ ఉన్న వారికి చపాతీ, నూనె లేని రోటీలు ఇస్తారు. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్య ఉన్నవారికి పెరుగుతో కూడిన భోజనం ప్రత్యేకంగా వడ్డిస్తారు. వీఐపీ ఖైదీలకు కోర్టు అనుమతి మేరకు బయటి నుంచి ఆహారం అందిస్తారు.


జైలులో మినరల్ వాటర్ ప్లాంట్

సంస్కరణలతోనే నాణ్యమైన భోజనం

గతంలో ఖైదీల ఆహారం విషయంలో కొంచెం కఠిన నిబంధనలు ఉండేవి. 2010లో తీసుకు వచ్చిన జైలు సంస్కరణలతో చాలా మార్పులు వచ్చాయి. అందులో భాగంగా ఖైదీలకు ప్రభుత్వం రుపొందించిన ఆహార నియమాలను అమలు చేస్తున్నాం. ఖైదీలకు నాణ్యమైన భోజనం అందిస్తూ వారి ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నాం.



-షఫీవుర్ రెహమాన్,
సూపరింటెండెంట్, జిల్లా జైలు

అధనపు బాధ్యతలు..?

- నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు
- ఒక్కో వార్డెన్‌కు మూడేసి వసతిగృహాల అప్పగింత
- సంక్షేమ వసతిగృహాల పర్యవేక్షణ గాలికి..
- ఆరోపణలొచ్చినా చర్యలకు మీనమేషాలు
- ముడుపుల వ్యవహారమే కారణమా..?



శ్రీసత్యసాయి జిల్లాలో గాడితప్పిన బీసీ వసతి గృహాల పాలన



ఓ ఉన్నతాధికారి అడ్డగోలు వ్యవహారం

అనంతపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి అనంత జిల్లా రెండుగా విడిపోయింది. పాలనను వికేంద్రీకరించారు. అయితే కొన్నిశాఖల పాలన నేటికీ అనంత జిల్లా నుంచే సాగుతోంది. ఆ కోవకు చెందినదే బీసీ సంక్షేమశాఖ. ఈశాఖ శ్రీసత్యసాయి జిల్లా బాధ్యతలను డిప్యూటీ డైరెక్టర్ కింది స్థాయి అధికారికి అప్పగించారు. ఆ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో బీసీ వసతిగృహాల పాలన పూర్తిగా గాడి తప్పింది. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఆ అధికారి అంతా తానై వ్యవహరిస్తున్నారు. దీంతో వసతి గృహాల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆ అధికారి నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్లకు మరో వసతిగృహాలకు ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలను అప్పగించడం వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ అధికారిని ఆ బాధ్యతల నుంచి తప్పించాలని, ముడుపులపై విచారణ చేయాలని అనేక విద్యార్థి సంఘాలు, కులసంఘాలు ఆందోళనలు చేపట్టారు. అలాగే ఆ జిల్లా కలెక్టర్‌కే స్పందనలో ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకూ చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు వెనుకంజ వేయడం వెనుక అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

నిబంధనలు గాలికి..

శ్రీ సత్యసాయి జిల్లాలోని నాలుగు డివిజన్ల పరిధిలో మొత్తం 57 బీసీ వసతిగృహాలు ఉన్నాయి. అందులో కదిరి డివిజన్ పరిధిలో 15, ధర్మవరం డివిజన్ 13, హిందూపురం డివిజన్‌లో 13, పెనుకొండ డివిజన్ పరిధిలోని 16 వసతి గృహాలు ఉన్నాయి. అయితే వీటి పర్యవేక్షణకు 23 మంది వార్డెన్లు మాత్రమే ఉన్నారు. వారిలో 8 మంది క్లాస్-4 ప్రమోట్ వార్డెన్లు కాగా... మిగిలిన 15 మంది రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారు. సగటున ఒక్కో వసతిగృహంలో 100 నుంచి 200 పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరికి వసతిగృహంలో కావాల్సిన సౌకర్యాలు కల్పించడంతో పాటు... ఉదయం, సాయంత్రం వేళల్లో చదివించే బాధ్యత వార్డెన్లదే. భద్రత కూడా వారిదే. ఆ వసతిగృహాల పర్యవేక్షణ సవ్యంగా సాగుతోందో లేదా అనేది నిత్యం సమీక్షించాల్సిన బాధ్యత ఆ శాఖ ఉన్నతాధికారికి ఉంటుంది. అయితే బీసీ వసతిగృహాలకు సరిపడా వార్డెన్లు లేకపోవడంతో సమీపంలో ఉన్న వసతిగృహాల పర్యవేక్షణ కోసం ఉన్న వార్డెన్లకే అదనపు బాధ్యతలను కేటాయించే అధికారం ఆ శాఖ ఉన్నతాధికారికి ఉంటుంది. ఇదే ఆ అధికారికి కలిసి వస్తోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక వసతి గృహాన్ని పర్యవేక్షించే రెగ్యులర్ వార్డెన్‌కు దానికి 20 కి.మీ పరిధిలో ఉన్న మరో వసతిగృహానికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలి. అయితే ఆ అధికారి ఆ నిబంధనలను తుంగలో తొక్కుతూ తనకు అనుకూలమైన వార్డెన్లకు 40 నుంచి 50 కి.మీ దూరంలో ఉన్న మరో వసతిగృహానికి ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీని వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను రెగ్యులర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వసతిగృహం పర్యవేక్షణపైనే సంబంధిత వార్డెన్లు సమయపాలన పాటించరనే విమర్శలున్నాయి. అట్లాంటిది 50 కి.మీలలోపు ఉన్న మరో వసతిగృహాన్ని పర్యవేక్షించడం సాధ్యమా అనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది. ఈనేపథ్యంలో వసతిగృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అడ్డగోలుగా ఇన్‌చార్జ్ బాధ్యతలు

బీసీ వసతిగృహాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం వెనుక భారీగా ముడుపులు పుచ్చుకున్నారనే ఆరోపణలు ఆ అధికారిపై తొలి నుంచీ వినిపిస్తూనే ఉన్నాయి. కదిరి డివిజన్‌లోని ఓ మండలంలో బీసీ హాస్టల్ వార్డెన్ విద్యార్థుల భోజనం కోసం సరఫరా చేసిన సరుకులు, బియ్యం అమ్ముకోవడం ఆధారాలతో బయటపడినా ఆయనపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. ఆ వార్డెన్‌పై విచారణ జరిగి, వాస్తవాలు వెలుగుచూసినా చర్యలు తీసుకోకపోవడం వెనుక రూ. వేలాది రూపాయల ముడుపులు ముట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ఆవార్డెన్‌కు చార్జ్ మెమోతో సరిపెట్టి విచారణ నివేదికను అటకెక్కించారనే విమర్శలున్నాయి. ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం వెనుక ఒక్కో వసతిగృహం నుంచి రూ. 40 వేల నుంచి రూ. 50 వేల వరకూ ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. డైట్ బిల్లులు మంజూరైనా సందర్భంలోనూ... ఏ వసతిగృహానికి ఎంత మొత్తం బిల్లు మంజూరయ్యిందో... ఆ మొత్తంలో 6 నుంచి 8 శాతం వరకూ ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు ఆ వర్గాలే బహిరంగంగా చెప్పుకుంటున్నాయి. జిల్లాలోని ఓ డివిజన్‌లో పనిచేసే ఓ వార్డెన్‌కు ఏబీసీడబ్ల్యూఓ ఉద్యోగోన్నతి కల్పించేందుకు రూ. లక్షల్లో ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ శాఖ నిబంధనల మేరకు సీనియార్టీ జాబితాలో ముందు వరుసలో ఉన్న వార్డెన్లను కాదని ముడుపులు చెల్లించినవారికి ప్రమోషన్ కట్టబెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముడుపుల వసూళ్ల కోసం తన కార్యాలయంలో పనిచేసే ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని మధ్యవర్తిగా నియమించుకున్నట్లు విమర్శలు ఉన్నాయి.

మచ్చుకు కొన్ని..

- ధర్మవరం డివిజన్‌లోని బుక్కపట్నం వార్డెన్‌కు హిందూపురం డివిజన్‌లోని రెడ్డిపల్లి వసతి గృహం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. బుక్కపట్నం నుంచి రెడ్డిపల్లి వసతిగృహానికి వెళ్లాలంటే... దాదాపు 70 కి.మీ ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అదే వార్డెన్‌కు ముదిగుబ్బ మండలం వై.వి పల్లి బీసీ హాస్టల్ ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. బుక్కపట్నం-వై.వి పల్లికి 40 కి.మీ దూరం ఉంది. ఒక్క వార్డెన్‌కు మూడు వసతి గృహాలను అప్పగించారంటే... ఆ వార్డెన్ ఆ మూడు వసతిగృహాలను పర్యవేక్షించడం సాధ్యమా అన్నది ఆ అధికారే చెప్పాలి.
- కదిరి డివిజన్‌లో తిమ్మమ్మ మర్రిమానులోని బీసీ వసతిగృహం వార్డెన్‌కు కదిరిలోని ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ రెండు వసతిగృహాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. తిమ్మమ్మ మర్రిమాను నుంచి కదిరికి వెళ్లాలంటే దాదాపు 30 కి.మీ దూరం ఉంది. ఆ వార్డెన్‌కు మూడు వసతిగృహాల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.
- ధర్మవరం డివిజన్ పుట్టపర్తిలోని బీసీ వసతిగృహం వార్డెన్‌కు కదిరి డివిజన్‌లోని నల్లమాడ కాలేజీ బాయ్స్ హాస్టల్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇలా పెనుకొండ, హిందూపురం డివిజన్లలోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి.



తన శాఖలో జరుగుతున్న అక్రమాలను నిరోధించాల్సిన బాధ్యత బీసీ సంక్షేమశాఖకు సారథ్యం వహిస్తున్న జిల్లాకు చెందిన మంత్రి సవిత పైనే ఉంది. అలాగే ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయించాల్సిన బాధ్యత కూడా ఆమెపైనే ఉందనడంలో సందేహం లేదు. అక్రమ వసూళ్లతో వసతి గృహాలను భ్రష్టు పట్టిస్తున్న ఆ అధికారిపై ఏ మేరకు చర్యలకు ఉపక్రమిస్తారో వేచి చూడాల్సిందే.

ఐదు అంతస్థులపై నుంచి ఫ్లెక్సీని జారవిడిచేందుకు ఎక్కిన విద్యార్థులు



పట్టు తప్పితే..!

ఓటీపీఆర్ఐ విద్యార్థుల భయంలేని పనులు

డైరెక్టర్, ప్రిన్సిపాల్ సమక్షంలోనే 'సాహసాలు'

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మనిషి సగటు ఎత్తుపై నుంచి పడితేనే.. కాళ్ళు, చేతులు విరుగుతాయి. అదే ఐదు అంతస్థులపై నుంచి పడితే ఇంకేముంది ఊహించుకుంటేనే ఒళ్లు జలధరిస్తుంది. అలాంటి పరిస్థితే సోమవారం జేఎన్టీయూ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ(ఓటీపీఆర్ఐ) కళాశాలలో జరిగింది. సాక్షాత్తు కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ సమక్షంలోనే ఇలాంటి భయంలేని పనులు చేయడం గమనార్హం. కళాశాలలో ఈ విద్యాసంవత్సరం ఫార్మా-డీ కోర్సులో విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారు. ఈ బ్యాచ్‌తోపాటు ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం బ్యాచ్‌లకు వేరువేరుగా వినూత్నంగా పేర్లు పెట్టడానికి సంకల్పించారు. పేరును సర్‌ప్రైజ్‌గా ప్రదర్శించాలని(రివీల్) ఫ్లెక్సీ తయారు చేయించారు. విద్యార్థులు ఉత్సాహంతో వినూత్నంగా చేయాలని తలపించారు. ఇందులో భాగంగా కళాశాల ఐదో అంతస్థు భవనంపై నుంచి ఫ్లెక్సీని ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఏదైనా పొరపాటు జరిగితే జేఎన్టీయూకి చెడ్డ పేరు వస్తుందన్న అంశాన్ని అధికారులు విస్మరించారు. సాక్షాత్తు డైరెక్టర్, ప్రిన్సిపాల్ సమక్షంలోనే విద్యార్థులు భవనంపైకి ఎక్కి ఫ్లెక్సీని జారవిడిచారు. గాలికి ఫ్లెక్సీ ఎగిరిపోవడంతో దానిని విద్యార్థులు పట్టుకోవడానికి యత్నించారు. దాదాపు 50 అడుగుల ఎత్తులో భవనంపై నిలబడటానికి మినహా పట్టుకోవడానికి ఎలాంటి సాయం లేదు. అయినా విద్యార్థులు ఉత్సుకతతో ప్రమాదపు అంచులకు రావడంతో కిందనున్న విద్యార్థులు ఒక్కసారిగా గట్టిగా కేకలు వేశారు. ఇలాంటి భయంలేని పనులతో భవిష్యత్‌ను కోల్పోవాల్సిందేనని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడితోనైనా డైరెక్టర్, ప్రిన్సిపాల్ తేరుకుని వారించకపోవడంతో మళ్లీ నాలుగో అంతస్థులోకి వచ్చి ఫ్లెక్సీని జారవిడిచేందుకు ప్రయత్నించారు.

కరాటే, తైక్వాండోపై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ యాజ మాన్య స్కూళ్లలో చదివే బాలికలకు ఆత్మరక్షణ కళలపై శిక్షణ ఇవ్వడానికి ప్రముఖ సంస్థలు, సొసైటీలు, ట్రస్టుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షణ పరిశీలన-ఆత్మ రక్షణ ప్రశిక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) కార్య క్రమం కింద శిక్షణ ఇస్తామన్నారు. ఎంపీయూపీ స్కూళ్లలో 6,7,8 తరగతులు చదివే 4,238 మంది విద్యార్థినులకు, జడ్పీ హైస్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, మున్సిపల్, సామాజిక సంక్షేమ, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకూ చదివే 42,555 మంది విద్యార్థినులకు కరాటే, తైక్వాండో వంటి కళలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ కళలపై శిక్షణ ఇవ్వడంలో మూడేళ్ల అనుభవం ఉన్న రిజిస్టరైన జిల్లాలోని ప్రముఖ సంస్థలు, ట్రస్టులు, సొసైటీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత ఉండి, ఆసక్తి ఉన్న సంస్థలు దరఖాస్తులను సమగ్ర శిక్ష కార్యాలయంలో పొంది, వాటిని పూర్తి చేసి ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కార్యాలయంలో అంద జేయాలని ఆమె సూచించారు.

విజేత హిందూపురం

ముగిసిన ఖేలో ఇండియా అస్మిత్ అండర్-13 ఫుట్‌బాల్ టోర్నీ


విజేతగా నిలిచిన హిందూపురం జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా అస్మిత్ అండర్-13 బాలికల ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా హిందూపురం జట్టు నిలిచింది. జనవరి 27 నుంచి ఆంధ్రాఫుట్‌బాల్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా అస్మిత్ అండర్-13 బాలికల ఫుట్‌బాల్ లీగ్ టోర్నీ సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ముగిసింది. హిందూపురం, కళ్యాణదుర్గం జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో 2గోల్స్ తేడాతో హిందూపురం జట్టు గెలిచింది. ఇండియా ఉమెన్ ఫుట్‌బాల్ జట్టు హెడ్‌కోచ్ క్రిస్పిన్ ఛెత్రీ, అసిస్టెంట్ కోచ్ ప్రియ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా క్రికెట్ కోచ్ అనితామిశ్రాల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల రన్నరప్ అనంత


అనంత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లా మహిళల జట్టు రన్నరప్‌గా నిలిచింది. మూడు రోజులుగా నెల్లూరులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఉమెన్ హాకీ చాంపియన్‌షిప్-2025 సోమవారం ముగిసింది. ఫైనల్లో కడపతో తలపడిన జిల్లా జట్టు పోరాడి ఓడిపోయింది. తద్వారా రన్నరప్‌గా నిలిచింది. హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ జట్టుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి అక్రమ్‌బాషా, కోచ్ దేవకి, మేనేజర్ సంతోష్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కుమార్ ఎంటర్‌ప్రైజెస్ రిజిస్ట్రేషన్ రద్దు

జరిమానాకు రంగం సిద్ధం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): పాలకు సంబంధించి మాల్టోడెక్సిన్ విక్రయిస్తున్న కుమార్ ఎంటర్ ప్రైజెస్ రిజిస్ట్రేషన్లను పన్నుల శాఖ అధికారులు రద్దు చేశారు. గతంలో ఇతడు కమలానగర్‌లో శ్రీ కుమారి, కుమార్ ఎంటర్ ప్రైజెస్ పేర్లతో వ్యాపార లావాదేవీలు నిర్వహించాడు. ఆ సమయంలో వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న వీధిలోని డోర్ నంబర్ 14/279లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తానని పన్నుల శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. డీసీఎంఎస్ కార్యాలయం సమీపంలో డోర్ నంబర్ 14/457లో లావాదేవీలు సాగించాడు. ఈ క్రమంలో గతంలోనే 2023, 2024 ఆ రెండు రిజిస్ట్రేషన్లు రద్దయ్యాయి. తాజాగా సోమవారం సీటీఓ-2 నరసింహులు తనిఖీ చేశారు. తాజాగా హేమావతి ఎంటర్‌ప్రైజెస్ పేరుతో వ్యాపారలావాదేవీలు నిర్వహిస్తుండటంతో ఆ రిజిస్ట్రేషన్‌ను సైతం రద్దు చేశారు. జరిమానా సైతం విధించనున్నట్లు ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

హుండీ చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ధర్మవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం నసనకోట ముత్యాలమ్మ ఆలయ హుండీ చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రామగిరి మండలం ముత్యాలమ్మ ఆలయంలో ఈ నెల 3న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీని చోరీచేశారు. ఆలయ ఈఓ ఫిర్యాదు మేరకు రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్ కేసు నమోదు చేసుకున్నారు. రామగిరి సీఐ శ్రీధర్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక సరిహద్దు వద్ద నిందితులు ఉన్నట్టు సమాచారం రావడంతో రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్, సిబ్బంది ఎంసీపల్లి క్రాస్ వద్ద ముగ్గురు దొంగలను అరెస్టు చేసి బైకు, మూడు సెల్ ఫోన్లు, రూ.1,70,712 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరచగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించినట్టు డీఎస్పీ తెలిపారు. కేసును వారం రోజుల్లో ఛేదించిన సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్, సిబ్బందిని ఎస్పీ వి.రత్న అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రామ్‌చరణ్ మృతదేహం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో ఇంటికి పెయింటింగ్ వేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి ఓ యువకుడు సోమవారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు బత్తలపల్లి మండలం మాళ్యవంతం గ్రామానికి చెందిన మారుతి, సరస్వతి దంపతుల కుమారుడు రామ్‌చరణ్(17) మరికొంత మందితో కలిసి మల్లేనిపల్లి గ్రామంలోని ప్రతాప్‌రెడ్డి ఇంటికి పెయింటింగ్ వేసేందుకు వెళ్లారు. ఇంటిబయట ఇనుప నిచ్చెన మీద రామ్‌చరణ్ పెయింట్ వేస్తూ పక్కకు మార్చుకునేందుకు నిచ్చెనను తీస్తుండగా ఇంటిపైన ఉన్న కరెంట్ వైర్లు తగిలాయి. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై కిందపడ్డాడు. వెంటనే అక్కడున్న వారు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సంఘ టనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

నీటి కుంటలో పడి వృద్ధుడు..


లక్ష్మీనాయక్ (ఫైల్)

కదిరి అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నపుగుట్ట తండా సమీపంలోని నీటికుంటలో పడి సోమవారం ఓ వృద్ధుడు మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు సున్నపుగుట్టతండాకు చెందిన లక్ష్మీనాయక్ (61) ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. అయితే సోమవారం తెల్లవారు జామున నీటి కుంట ప్రాంతంలో మృతుడి చెప్పులు, దుస్తులు గుర్తించారు. కుంటలో పడి ఉండవచ్చనే అనుమానంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని, అగ్నిమాపక సిబ్బందితో కుంటలో గాలించారు. నీళ్ల అడుగు భాగంలో కాళ్లకు తీగలు చుట్టుకోవడంతో బయటకు రాలేక మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి భార్య మినీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కలువ పువ్వులకోసం తన భర్త కుంటలోకి వెళ్లి ఉంటారని, ప్రమాదవశాత్తు అందులో పడి ఉండవచ్చని మృతుడి భార్య ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

కదిరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్య కేసులో భర్తను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన మేరకు పట్టణంలోని అడపాల వీధిలో నివాముంటున్న స్వాతి అనే మహిళ, ఈనెల 5న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణం ఆమె భర్త కేశవయ్య వేధింపులే అని మృతురాలి తండ్రి రామక్రిష్ణ ఫిర్యాదు చేశారు. దీంతో కేశవయ్యను సోమవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు.

యూరియా.. దోపిడీ..!


లారీలో లోడ్ చేసిన యూరియా బస్తాలు (ఫైల్)

- ఒక్కో లారీకి అదనంగా రూ.10 వేలు వసూలు
- పలు కంపెనీల ప్రతినిధుల నిర్వాకం
- కొందరు కీలక అధికారులతో కుమ్మక్కు
- రైతులకు తప్పని భారం

అనంతపురం అర్బన్/పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో యూరియా దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. గత కొన్నేళ్లుగా ఈ దందా సాగుతున్నా ఈ సారి మరింత ఎక్కువైంది. శ్రీసత్యసాయి జిల్లాలో పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. అన్ని రకాల పంటల ఎదుగుదల, అభివృద్ధి, దిగుబడిలో యూరియా కీలకంగా పని చేస్తుంది. యూరియాకున్న డిమాండ్‌ను ఆసరా చేసుకొని కొందరు కీలక అధికారులు, కంపెనీల ప్రతినిధులు కుమ్మకై డీలర్ల నుంచి అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. దీని ప్రభావం రైతులపై తీవ్రంగా పడుతోంది. ప్రతి ఏడాది యూరియాపై అదనపు వసూళ్లకు పాల్పడుతూ కొందరు కీలక అధికారులు, కంపెనీల ప్రతినిధులు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

● లారీకి రూ.10వేలు..

కేంద్ర ప్రభుత్వం యూరియాపై సబ్సిడీ ఇస్తోంది. యూరియా బస్తా పూర్తి ధర రూ.2500, ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.2233.50 రాయితీ ఇస్తోంది. రైతు వాటా బస్తాకు రూ.266.50లు పడుతుంది. ఒక లారీ 10 టన్నులు (222 బస్తాలు) యూరియా కావాలంటే కొన్ని కంపెనీల ప్రతినిధులు డీలర్ల నుంచి రూ.10వేలు అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. యూరి యా ఎమ్మార్పీ రూ.266.50 ఉంది. డీలర్ల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తుండటంతో ఒక్కో బస్తాపై అదనంగా రూ.45లు పడుతోంది. అలాగే లారీ బాడుగ, హమాలీ ఖర్చులు కలిసి డీలర్‌కు గిట్టుబాటు కావడం లేదు. అలాగే హోల్ సెల్ డీలర్ వద్ద నుంచి యూరియా తీసుకునే రిటైల్ డీలర్లకు బస్తా రూ.310 పడుతోంది. డీలర్ల నుంచి వసూలు చేసిన సొమ్మును కొందరు కీలక అధికారులకు రహస్యంగా వాటాలు పంచుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

● రైతులపైనే..!

కొందరు కీలక వ్యవసాయ అధికారులతో కుమ్మక్కైన పలు కంపెనీల ప్రతినిధులు యూరియా సరఫరా చేసినందుకు వసూళ్లకు పాల్పడుతుండటంతో ఎమ్మార్పీ కంటే అదనంగా డబ్బులు చెల్లించి యూరియాను డీలర్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నేరుగా కంపెనీలు, హోల్ సెల్ డీలర్ల నుంచి యూరియా కొనుగోలు చేసిన రిటైల్ డీలర్లు బస్తా యూరియాను రైతులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే శ్రీసత్యసాయి జిల్లాలోని డీలర్లు యూరియా బస్తా రూ.330 నుంచి రూ.350లకు విక్రయిస్తున్నారు. అనంత జిల్లాలో యూరియా బస్తా రూ.320 నుంచి రూ.350లు దాకా విక్రయిస్తున్నారు. కో-ఆపరేటివ్ సొసైటీల్లో యూరియా బస్తా రూ.275 నుంచి రూ.285లకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు డీలర్లు కొన్ని కో-ఆపరేటివ్ సొసైటీల నుంచి యూరియాను కొనుగోలు చేసి డిమాండ్ లేని ప్రాంతాల్లోని రైతులకు బస్తా రూ.300 నుంచి రూ.310లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ అదనపు భారమంతా రైతులపైనే పడుతోంది. డీలర్లకు ఎమ్మార్పీ కంటే తక్కువ యూరియా అందిస్తే, రైతులకు ఎమ్మార్పీకి విక్రయించే పరిస్థితి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో అందుకు విరుద్ధంగా వ్యవహారం నడుస్తోంది.

● శ్రీసత్యసాయి జిల్లాలో వాడకంపై సందేహాలు

శ్రీ సత్యసాయి జిల్లాలో గతంతో పోలిస్తే ఈసారి అదనంగా ఎరువులు వాడినట్లు సమాచారం. 2024-25 ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లాలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాభావంతో పంట సాగు విస్తీర్ణం తగ్గింది. శ్రీసత్యసాయి జిల్లాలో కరువు పరిస్థితులు మరింత ఎక్కువే. అయితే ఆ జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో కేటాయించిన మోతాదు కంటే ఎక్కువగా యూరియా విక్రయాలు జరగడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 14040 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయం జరుగుతుందని అధికారులు భావించగా 16401 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయి. 2024 ఖరీఫ్‌లో 14875 మెట్రిక్ టన్నులకుగాను 18561 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగినట్లు ఆ శాఖ అధికారుల నివేదికలు తెలుపుతున్నాయి. అంటే ఖరీఫ్‌లో అదనంగా 3686 మెట్రిక్ టన్నులు అదనంగా విక్రయాలు జరిగాయి. అనంత జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 33989 మెట్రిక్ టన్నులు కేటాయించగా 27264 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయి. 2024 ఖరీఫ్‌లో 38177 మెట్రిక్ టన్నులకుగాను 28957 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయి.

● సరఫరా వివరాలు ఏఓలు, ఏడీఏలకు ఇవ్వని వైనం..!

2014- 2019 టీడీపీ పాలనలో రిటైల్ డీలర్లు, హోల్ సెల్ డీలర్లకు ఎంత మోతాదులో ఎరువులు సరఫరా చేస్తున్నారో ఆ వివరాలను స్థానిక ఏఓ, ఏడీఏలకు అందజేసేవారు. గత వైసీపీ హయాం నుంచి రిటైల్ డీలర్లు, హోల్ సెల్ డీలర్లకు ఎరువుల రకాల వారిగా ఎంత మోతాదులో సరఫరా చేశారన్న వివరాలు ఇవ్వడం ఆపేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఎనిమిది నెలలు గడుస్తున్నా అదే పరిస్థితులు కొనసాగాయి. శ్రీసత్యసాయి జిల్లాలో కరువు పరిస్థితుల్లోనూ అదనంగా యూరియా వాడకం ఎలా సాధ్యమన్న చర్చ జోరుగా జరుగుతుండటంతో అక్కడి ఉన్నతాధికారులు అప్రమత్తమైన ట్లు సమాచారం. ఈక్రమంలోనే నాలుగు రోజుల కిందట నుంచి డీలర్లకు సరఫరా చేసిన ఎరువుల వివరాలను స్థానిక ఏఓలు, ఏడీఏలకు పంపినట్లు సమాచారం. శ్రీ సత్యసాయి జిల్లా నుంచి యూరియాతోపాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. ఈ నేపథ్యంలోనే ఏఓలు, ఏడీఏలకు యూరియా, ఇతర ఎరువులు ఏఏ డీలర్లకు ఎంత మోతాదులో సరఫరా చేశారన్న వివరాలు అందించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సొమ్ము రికవరీ ఏదీ..?

- ఏడాదిన్నరైనా స్పందన కరువు
- రెగ్యులర్ సిబ్బందికి ఇబ్బందులు తప్పవా..?
- అటకెక్కిన అటవీశాఖలో స్వాహా కేసు
- పట్టించుకోని కొత్త అధికారులు



అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో దుర్వినియోగమైన సొమ్ము రికవరీ అటకెక్కిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనంతపురం రేంజ్ కార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్ ఆ శాఖ ఖజానాకు చేరాల్సిన సొమ్మును దారి మళ్లించి స్వాహా చేసిన సంఘటన వెలుగుచూసి ఏడాదిన్నర గడిచిపోయింది. దానికి సంబంధించిన రికవరీ విషయంలో పట్టించుకునే వారు లేరనే చర్చ జరుగుతోంది. శాఖ ఖజానాకు చేరాల్సిన సొమ్మును నకిలీ చలానాలతో ఓ కాంట్రాక్ట్ వర్కర్ స్థానిక అధికారుల సహకారంతో స్వాహా చేశాడు. రూ.15 లక్షల సొమ్ము కాజేసినా స్థానిక అధికారులు, అకౌంట్స్ విభాగం, సూపరింటెండెంట్, రేంజ్ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇందులో కొందరికి వాటాలు చేరాయన్న విమర్శలు అప్పట్లో వినిపించాయి. సెంట్రల్ ఆడిట్‌లో అడ్డంగా దొరికిపోవడంతో అక్రమార్కుడి బండారం బయటపడింది. దాంతో జిల్లా అటవీశాఖ కార్యాలయం ఉలిక్కిపడింది. స్వాహా చేసిన వ్యక్తి కాంట్రాక్ట్ ఉద్యోగి కావడంతో ఆ సొమ్ముకు రెగ్యులర్ సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆ శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఘటనపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులను సైతం స్టేషన్‌కు పిలిపించి అప్పట్లో చర్చించడంతో తిరిగి శాఖకు చెల్లిస్తామని చెప్పుకొచ్చినట్లు ప్రచారం జరిగింది. పోలీసులకు దొరకకుండా అక్రమార్కుడు నేరుగా కోర్టులో హాజరయ్యాడు. విచారణ అనంతరం సెంట్రల్ జైలుకు పంపారు. అప్పటి డీఎఫ్ఓ అక్రమార్కుడి నుంచి సొమ్ము రికవరీ చేసేంత వరకు బెయిల్ ఇవ్వకుండా ప్రయత్నించారు. అనంతరం ఆ శాఖ సిబ్బంది సహకారంతో ఎలాగో బెయిల్ బయటకు వచ్చాడు. అక్రమాలకు పాల్పడిన మాట వాస్తవమేనని, ఆ సొమ్ము చెల్లిస్తానని అటవీశాఖ అధికారులకు విన్నవించినట్లు తెలిసింది. దీంతో శాఖ అధికారులు సైతం సొమ్ము రికవరీ చేస్తే చాలన్న ఉద్దేశంతో మిన్నకుండిపోయారు. అతడు బయటకు వచ్చిన తరువాత సొమ్ము రికవరీకి సంబంధించి పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. శాఖ సిబ్బంది డీఎఫ్ఓ వద్దకు వచ్చి మాట్లాడాలని అక్రమార్కుడికి చెప్పినా.. కోర్టు ద్వారానే తేల్చుకుంటామని ప్లేటు ఫిరాయించినట్లు తెలిసింది. దీంతో క్షేత్ర స్థాయి సిబ్బంది ఉన్నతాధికారుల నుంచి ఎప్పుడు ఎలాంటి సమస్య వచ్చిపడుతుందోనని బిక్కు బిక్కు మంటున్నారు. తర్వాత డీఎఫ్ఓ, సీసీఎఫ్ బదిలీపై వెళ్లారు. కొత్త అధికారుల దృష్టికి ఈ సమస్య వెళ్లకుండా కొందరు అధికారులు జాగ్రత్తలు పడుతున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం రికవరీ చేస్తే సరి..? లేదంటే ఎప్పటికైనా ఇబ్బందులు తప్పవని మదనపడుతున్నారు. కొత్తగా వచ్చిన అధికారులు దీనిపై దృష్టిసారించలేదన్న విమర్శలు ఉన్నాయి.

నోరు అదుపులో పెట్టుకోండి..

- మా దృష్టంతా అభివృద్ధివైపే...
- మీపైకి మరల్చేలా చేసుకోవద్దు
- ప్రకాష్‌రెడ్డి, గోరంట్ల మాధవ్‌కు పరిటాల సునీత హెచ్చరిక



అనంతపురం, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): 'నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడండి... మా దృష్టంతా నియోజకవర్గ అభివృద్ధి వైపే ఉంది... మీపైకి దృష్టి మరల్చేలా చేసుకోవద్ద'ని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతపురంలోని తన నివాసంలో ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం మీడియాతో మాట్లాడారు. కనగానపల్లి మండలం గుంతపల్లిలో వ్యక్తిగత కారణాలతో జరిగిన గొడవను రాజకీయం చేస్తూ తమ కుటుంబంపై విమర్శలు చేయడం ఏంటని ఆమె ప్రశ్నించారు. ఈ ఘటనలో రెండు వైపుల వారికి గాయాలయ్యాయన్నారు. దీనిని వైసీపీ దాడిగా తాము ఎక్కడా చెప్పలేదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. గతం నుంచి వారి మధ్య వ్యక్తిగత కారణాలు, మనస్పర్థల నేపథ్యంలోనే గొడవ పడ్డారన్నారు. ఆ ఇద్దరి మధ్య జరిగిన గొడవను తెలుగుదేశం పార్టీకి, పరిటాల కుటుంబానికి ఆపాదిస్తారా అంటూ ఆమె మండిపడ్డారు. 'గత ఐదేళ్లలో మీరు.. ఎంత మందిపై అక్రమ కేసులు పెట్టించారో లెక్కేలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాల'ని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాధవ్‌కు హితవు పలికారు. పోలీసు వ్యవస్థ గురించి ప్రకాష్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని వ్యవస్థల్ని నాశనం చేయడంతోపాటు వాటిని స్వార్థం కోసం వాడుకున్న సంగతి మర్చిపోయారా అని ప్రకాష్‌రెడ్డిని ఆమె నిలదీశారు. ఇప్పుడిప్పుడే నిద్రలేచి ఖబడ్దార్ అంటూ మాధవ్ అరుస్తున్నట్లుగా ఉందన్నారు. గతంలో మీరు చేసిన వాటి గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత బాగుంటుందన్నారు. సభ్యత, సంస్కారం ఉంది కాబట్టి చెప్పడం లేదన్నారు. గత ఐదేళ్లలో ఎన్ని అరాచకాలు, దౌర్జన్యాలు చేసినా పట్టించుకోకుండా తాము నియోజకవర్గ అభివృద్ధిపైనే దృష్టి పెట్టామన్నారు. 'అదే మీరు చేసిన వాటికి ప్రతీకారం తీర్చుకోవాలని ఆలోచన వచ్చినా.. మీరన్నట్టు రాజకీయంగా చూడాల్సి వస్తే ఆ కథ వేరేలా ఉంటుంద'ని ఆ ఇద్దరు నేతలను ఆమె హెచ్చరించారు. నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం ఓ వైపు ప్రకాష్‌రెడ్డి.. మరోవైపు గోరంట్ల మాధవ్ పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. వారిలో వారికే పొసగక అంతర్గత కలహాలతో కొట్టుమిట్టాడుతున్నారన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎక్కడైనా చిన్న చిన్న ఘటనలు జరిగితే దానికి రాజకీయాల్ని ఆపాదించుకుంటూ అమాయక కార్యకర్తల్ని పక్కదారి పట్టిస్తున్నారన్నారు. చిన్న గొడవ జరిగినా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని ఆ ఇద్దరు నేతలకు పరిటాల సునీత హితవు పలికారు.

ఆటో బోల్తా : నలుగురికి గాయాలు

శింగనమల ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నజలాలపురం దోణరామేశ్వరుడి కొండపై నుంచి దిగుతున్న ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో నలుగురు భక్తులు గాయపడ్డారు. శింగనమల ఎస్సీ కాలనీకి చెందిన ఆరుగురు భక్తులు ఆటోలో సోమవారం చిన్నజలాలపురం దోణరామేశ్వరుడి కొండమీదకు వెళ్లారు. దర్శనం అనంతరం కొండ మీద నుంచి ఆటోలో వస్తుండగా బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో ఆటో కిందపడ్డంతో అందులో ఉన్న భక్తులు ఆదిలక్ష్మి కాలు నుజ్జునుజ్జు కాగా, గాయత్రి, సేహ్నా, సావిత్రి కి గాయాలయ్యాయి. ఈ మేరకు శింగనమల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొలుసుపై జాగ్రత్త వహించండి

- కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్


చీనీ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తాడిమర్రి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చీనీ పంటకు వ్యాపించే పొలుసు పురుగుపై రైతులు జాగ్రత్త వహించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్ పేర్కొన్నారు. సోమవారం తాడిమర్రి మండలంలోని ఏకపాదంపల్లి వద్ద చీనీ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పొలుసు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, ఇది లేత ఇగుర్లు, పూతను దెబ్బతీసిందన్నారు. పురుగుల మందులే కాకుండా పసుపు రంగు చిగురు అట్టలు అమర్చి నివారించుకోవచ్చు అన్నారు. ఇమిడా క్లోప్రిడ్ 0.5ఎంఎల్ లేదా థయోమెతాక్సిన్ 0.3గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కలు, మొదళ్ల పైవరకు తడిసేలా పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, రైతులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

5.96 లక్షల మందికి ఆల్బెండజోల్ పంపిణీ

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం ఒక్కరోజే 5,96,128 మంది పిల్లలకు నులిపురుగుల నివారణకు సంబంధించిన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ఏడాది నుంచి 19 ఏళ్ల వయసులోపు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీని వైద్యశాఖ నిర్వహించింది. 6,08,529 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేయాలని వైద్యశాఖ లక్ష్యం పెట్టుకుందని ఆమె తెలిపారు. 97.96 శాతం మాత్రలు వేశామని, మిగిలిన పిల్లలు అందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ వేయిస్తామని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.13



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

'మైనార్టీ' పాలన అస్తవ్యస్తం..!

- ఉమ్మడి జిల్లాకు ఒకే ఏడీ స్థాయి అధికారి
- సిబ్బంది అందరూ అవుట్ సోర్సింగే..
- డీటీలు ముందుకొచ్చినా.. నో పోస్టింగ్
- శ్రీసత్యసాయి జిల్లాలో కార్యాలయమే లేదు
- ఇదీ మైనార్టీ సంక్షేమశాఖ దుస్థితి


మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమ శాఖకు సిబ్బంది లేక పాలన అస్తవ్యస్తంగా మారింది. సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో మైనార్టీ సంక్షేమ శాఖ కీలకంగా పనిచేస్తుంది. అలాంటి సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లాలో నామమాత్రంగా మారిపోయింది. అనంత జిల్లాలో ఒక్క ఏడీ తప్ప.. ఒక్కరంటే ఒక్కరు కూడా రెగ్యులర్ అధికారి లేరు. అంతా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే... దీంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. పాలనాపరమైన అంశాల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పూర్తిస్థాయి అధికారాలు ఉండవు. ఒక్క ఏడీ స్థాయి అధికారే అన్ని పనులు చూసుకోవాల్సి వస్తుండడంతో పాలన ఇబ్బందికరంగా మారింది. సత్యసాయి జిల్లాలో మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయమే ఏర్పాటు చేయలేదు. దీంతో అక్కడ ఏ కార్యక్రమమైనా అనంత జిల్లా ఏడీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సి వస్తోంది. ఆ జిల్లాలోని మైనార్టీలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు అనంతకే రావాల్సి వస్తోంది. రెండు జిల్లా పనులు చూసుకోవాలంటే వారికి తలకుమించిన భారమవుతోంది.

డీటీ స్థాయి అధికారులు ముందుకొచ్చినా..

అనంత జిల్లా కార్యాలయంలో ఏడీ మినహా.. అందరూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే. కార్యాలయంలో ఒక సూపరింటెండెంట్, రెండు సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాలనాపరమైన అంశాల్లో ఈ పోస్టులు చాలా కీలకం. ఈ పోస్టుల కోసం ఇప్పటికే ధర్మవరం, కళ్యాణదుర్గానికి చెందిన ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు ఫైళ్లను అనంత మైనార్టీ శాఖకు పంపినట్లు సమాచారం. వారి ఫైళ్లను పరిశీలించిన మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు కలెక్టర్‌కు పంపినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ అధికారుల నియామకం చేపట్టలేదు.

ప్రొటోకాల్, వేడుకల నిర్వహణలో సమస్య

సత్యసాయి జిల్లాలో మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయం లేకపోవడం పలు సందర్భాల్లో సమస్యగా మారుతోంది. కొత్త జిల్లా ఏర్పడినప్పటి నుంచి కార్యాలయం, అధికారుల నియామకం చేయాలని రాష్ట్రశాఖకు.. ప్రతిపాదనలు వెళ్లినప్పటికీ తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఆ శాఖ మంత్రుల పర్యటన, అధికారిక కార్యక్రమాల నిర్వహణ సమయంలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గత సంవత్సరం డిసెంబరు నెలలో ఏపీ మైనార్టీ అఫైర్స్ ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. ఆయన పెనుకొండలో పర్యటించినప్పుడు ప్రొటోకాల్ సమస్య కొట్టొచ్చినట్లు కనిపించింది. ముందస్తు క్రిస్మస్, రంజాన్ వేడుకల నిర్వహణ సమయంలోనూ రెండు జిల్లాల్లో అవే సమస్యలు ఉత్పన్నమయ్యాయి. అస్తవ్యస్తమైన మైనార్టీ శాఖను గాడిలో పెట్టాలని ఆ వర్గ ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

ప్రజా ఫిర్యాదులపై స్పందించండి : ఎస్పీ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రజాఫిర్యాదులపై సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ వి.రత్న సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ మొత్తం 58 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్బీసీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

● పుట్టపర్తిటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా రెవెన్యూ అధికారి విజయసారధి మొత్తం 125 అర్జీలను స్వీకరించారు. సకాలంలో అర్జీలను పరిష్కరించాలని, గడువు దాటితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి


దరఖాస్తులు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

తాడిమర్రి ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కమతం కాటమయ్య, వ్యవసాయ కార్మికసంఘం కార్యదర్శి లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం తాడిమర్రిలో సమావేశం ఏర్పాటు చేసుకుని ఇళ్లు లేని పేదల వివరాలు సేకరించారు. 10 సంవత్సరాలుగా నివాసముంటున్న ఇళ్లకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పెద్దన్న, చౌడప్ప, నాగభూషణం పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయండి

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన విశ్వకర్మ యోజన పథకం కింద కులవృత్తులవారికి బ్యాంకర్లు జాప్యం చేయకుండా రుణాలు మంజూరు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు వీరాంజి కోరారు. సోమవారం స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్ మేనేజర్లను విజ్ఞప్తి చేశారు.

రహదారికి మరమ్మతులు చేపట్టండి

ధర్మవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మొదటి వార్డు గూడ్‌షెడ్ కొట్టాలకు రహదారి శిథిలావస్థలో ఉందని, దానికి మరమ్మతులు చేపట్టాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు ప్రజావేదికలో విన్నవించారు. 20 ఏళ్లక్రితం ఆ కాలనీకి తారు రోడ్డు వేశారని, అప్పటి నుంచి ఇప్పటివరకు రహదారి మరమ్మతులు చేపట్టకపోవడంతో దారి అంతా గుంతలమయంగా ఉందని అన్నారు. సమస్యను మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి రహదారికి మరమ్మతులు చేసేలా చూస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు హైదర్‌వలీ, చేనేత నాయకులు వెంకటస్వామి పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై తాడేపల్లి పంచాయతీరాజ్ గ్రామీణ శాఖ కమిషన్ కార్యాలయం వద్ద ఈనెల 24న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు.

చేపల చెరువు వేలం వేయండి

తనకల్లు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి గ్రామ సమీపంలో ఉన్న గుట్టిగంగమ్మ చెరువును వేలం వేసి, పంచాయతీ ఆదాయానికి గండిపడకుండా కాపాడాలని గీతాలవారిపల్లికి చెందిన కానుగమాను నరసింహులు తహసీల్దార్ శోభానువర్ణమ్మకు సోమవారం వినతిపత్రం అందచేశారు. పంచాయతీకి సంబంధించిన చేపల చెరువును వేలం వేయకుండా కొంతమంది అనధికారికంగా చేపలు పట్టుకొని అమ్ముకొంటున్నట్లు చెప్పారు. దీంతో పంచాయతీ ఆదాయానికి గండిపడుతోందన్నారు. ఒత్తిళ్లకు తలొగ్గి చేపల చెరువు వేలం నిర్వహించకపోతే గ్రామస్థులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి సంబంధితాధికారులతో చర్చిస్తామన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయండి


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టాలు మంజూరు చేసి తమకు న్యాయం చేయలని భవన నిర్మాణ కార్మికులు సోమవారం ఆర్డీవో వీవీఎస్ శర్మకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గతంలో పట్టణ శివారు ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికుల కోసం సంఘం ద్వారా ఒక్కొక్క వ్యక్తి నుంచి రూ.1,250 వంతున 500 మంది కార్మికుల నుంచి అప్పటి భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు ఎస్. అహమ్మద్‌అలీ వసూలు చేశారన్నారు. కాగా కొంతమందికి మాత్రమే అప్పట్లో పట్టాలిచ్చారని, మిగిలిన వారికి ఇవ్వలేదని వాపోయారు. పట్టాలు అతని వద్దే పెట్టుకుని ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నారని, సంఘంలో సభ్యత్వం లేనివారికి అమ్ముకొంటున్నారని ఆరోపించారు. తమకు పట్టాలివ్వా లని అడిగితే డబ్బులిస్తేనే పట్టా ఇస్తానని డిమాండ్ చేస్తున్నాడన్నారు.

ఆక్రమణలు తొలగించాలని ఆందోళన

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువు మరవ ప్రాంతంలో దారి ఆక్రమణకు గురైందని, దీంతో తమ గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటోందని, ఆ ఆక్రమణలు తొలగించాలని మండలంలోని బాబాసాహెబ్ పల్లి గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. తమ గ్రామానికి ఓడీచెరువు మరవ నుంచి వెళ్లాలని, గతంలో 20 అడుగుల రోడ్డు ఉండేదని, ప్రస్తుతం ఆ రోడ్డు ఆక్రమణకు గురి కావడంతో కేవలం ఎనిమిది అడుగులే ఉందని వాపోయారు. ఆ రోడ్డు ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ అనంతచారికి అందించారు. ఈకార్యక్రమంలో బాబాఫక్రుద్దీన్, కాయల రామాంజ నేయులు, హైదర్‌వలీ, వాటర్ బాషా, రమేష్, ఆర్సీపీ మున్నా, రామచంద్ర పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న బాబాసాహెబ్ పల్లి వాసులు

ఆకాశానికి అపార్ట్‌మెంట్లు...

నిబంధనలకు నీళ్లు..!

- అనుమతులు లేకుండా నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- మూడు దశాబ్దాలైనా మారని పరిస్థితి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పుట్టపర్తిలో అపార్టుమెంట్లు, భారీ భవనాలను ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా నిరిస్తున్నారు. ఓ చిన్న కుగ్రామంగా ఉన్న పుట్టపర్తి సత్యసాయి బాబా వల్ల ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందింది. భవిష్యత్తులో సుందర పట్టణంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ముందుచూపు ఆలోచనతో 1992లో పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ (పుడా) ఏర్పాటు చేశారు. పుడా నిబందనల ప్రకారమే ఇక్కడ అపార్టుమెంట్లు, భవనాలు నిర్మించుకోవాలి. అనుమతులు, పర్యవేక్షణ కోసం, వైస్‌చైర్మన్‌స్థాయి అధికారి, సిబ్బందిని నియమించారు. అయితే క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల బిల్డర్లు నిబంధనలను గాలికి వదిలేసి.. ఇష్టారాజ్యంగా భవనాలను నిర్మించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. గాలి, వెలుతురు రాని భవనాలనూ కొకొల్లలుగా నిర్మించారు. ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే సంఘటనా స్థలానికి అగ్ని మాపక యంత్రం చేరుకోలేని పరిస్థితి ఉంది. ఇలా మూడు దశాబ్దాలుగా ఇష్టారాజ్యంగా భవనాల నిర్మాణాలు జరుగుతున్నా.. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావలసిన కోట్లాది రూపాయల ఆదాయానికి గండిపడుతోంది. ఇదిలా ఉండగా మేజర్ పంచాయతి మున్సిపాలిటీగా 2011లో పుట్టపర్తి రూపాంతరం చెందింది. ఏడున్నర సెంట్ల లోపల ఉన్న స్థలంలో భవనం నిర్మించుకోవాలంటే మున్సిపాలిటీ అనుమతి తప్పనిసరి. అపైన ఉన్న స్థలంలో భవనాలు నిర్మించాలంటే పుడా అనుమతి తీసుకోవాలి. రెండు శాఖల పర్యవేక్షణ ఉన్నా బిల్డర్లు మాత్రం యధేచ్ఛగా ఎలాంటి అనుమతులూ లేకుండా.. నిబందనలు పాటించకుండా భవనాలను నిర్మిస్తున్నారు. ఏడున్నర సెంట్లు, అంతకన్న తక్కువ స్థలంలో జీప్లస్‌టూ (గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు రెండు అంతస్థులు) నిర్మాణానికి అనుమతి ఉంటుంది. అంతకంటే ఎక్కువ అంతస్థులను నిర్మించడానికి అనుమతులు లేవు. అయితే ఏడున్నర సెంట్ల కన్నా తక్కువ స్థలంలో పదంతస్థులు అపార్టుమెట్లు వెలిశాయి. నిబంధనల ప్రకారం భవ నానికి చుట్టూ ఖాళీస్థలం .. వాహ నాలకు పార్కింగ్ స్థలం వదలాలి. అలా స్థలం వదలకుండా భవనాలను నిర్మించేశారు. అనుమతులు లేకున్నా సెల్లార్ నిర్మించి వాటిని సైతం అ మ్ముకొని బిల్డర్లు సొమ్ముకున్నారు. వెడల్పు అయిన రోడ్లు లేక పోవడంతో ఏదైనా ప్రమాదాలు జరిగి నపుడు సంఘటన స్థలానికి అగ్ని మాపక యంత్రాలు వెళ్ల లేని పరి స్థితి ఉంది. మరి కొన్ని చోట్ల ఆటోలు కూడా భవనాల దగ్గరకు వెళ్ళలే ని రోడ్లు ఉన్నాయి.

నోటీసులిచ్చాం

మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలను గుర్తించాం. నోటీసులు కూడా అందచేశాం. కో ర్టులో చార్జ్‌షీట్ కూడా వేశాం. వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.



-ధర్మరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి, పుట్టపర్తి మున్సిపాలిటీ


పుట్టపర్తిలో నిర్మించిన ఓ అపార్ట్‌మెంట్

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


ఎనుమలపల్లిలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలను సోమవారం పంపిణీ చేశారు. జిల్లాకేంద్రం పరిధిలోని ఎనుమలపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి విద్యార్థులకు ఆ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రామాంజినేయులు, సామకోటి ఆదినారాయణ, జిల్లా ఎన్సీడీ ఆర్‌బీఎస్కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత, వైద్యాధికారులు జోత్స్న, మునిచంద్రిక, సౌమ్య, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ పాల్గొన్నారు.

● కదిరి: తలుపుల మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించినట్లు డిప్యూటీ జిల్లా వైద్యాధికారి నాగేంద్రనాయక్ తెలిపారు. అందని వారికి ఈనెల 17న పంపిణీచేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అప్స, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు అందచేశారు. ఇందులో వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్, ఎంపీడీఓ ఆంజనప్ప, ఈఓఆర్డీ మాధవరెడ్డి, ఎస్‌ఓ రిహానా, ఏఎన్‌ఎం శంకరమ్మ, ఆశకార్యకర్తలున్నారు.

● గాండ్లపెంట: స్థానిక కేరళ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు డాక్టర్ బాబాఫక్రుద్దీన్ ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. ఇందులో సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ జోసఫ్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● నల్లమాడ: మండలంలోని 7,072మంది పిల్లలకు గాను 6,851 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు రెడ్డిపల్లి వైద్యాధికారిణి దీప్తి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామాంజనేయులు, సూపర్‌వైజర్ మంజుల, ఏపీహెచ్‌ఎలు, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజికవేత్త గడ్డం రాజగోపాల్ మృతి


గడ్డం రాజగోపాల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నియోజకవర్గం సామాజిక వేత్త, బీజేపీ నాయకుడు మద్దన్నగారిపల్లికి చెందిన గడ్డం రాజగోపాల్ యాదవ్ (42) సోమవారం తెల్లవారుజామున మరణించాడు. క్యాన్సర్‌తో బాధపడుతున్న అతను హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని అతని స్వగ్రామమైన మద్దన్నగారిపల్లికి తీసుకొచ్చారు. మృతదేహానికి ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన ఇన్‌చార్జ్ చిలకం మధుసూదనరెడ్డి, బీజేపీ ఇన్‌చార్జ్ హరీష్, కదిరి మాజీ ఎమ్మెల్యే ఎమ్మెస్ పార్థసారథి, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఎంపీపీ ఆదినారాయణ, టీడీపీ నాయకులు రమేష్‌బాబు, కరణం ప్రభాకర్, అశ్వర్థరెడ్డి, తుమ్మల మనోహర్ నివాళులర్పించారు.

● బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని రాఘవంపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త యోగానంద్ కొన్ని రోజుల క్రితం మరణించాడు. సోమవారం ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆ గ్రామానికి వెళ్ళి యోగానంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఘనంగా అచ్చామియా సాబ్ ఉరుసు



అచ్చామియా దర్గాలో భక్తుల సందడి

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలలోని అచ్చామియా సాహెబ్ పల్లిలో సోమవారం అచ్చామియా 433వ ఉరుసు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కవాలీ, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

గోవులను తరలించండి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భక్తులు దానం ఇచ్చే గోవులను గోశాలకు తరలించాలని సోమవారం ఆర్డీఓ వీవీఎస్ శర్మకు విశ్వహిందూపరిషత్, భజరంగదల్, హిందూ ధార్మిక సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. ఆలయానికి సబంధించిన గోవులను అధికారులు పట్టించుకోకపోవడంతో అవి పట్టణంలో రోడ్లపై తిరుగుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నట్లు వాపోయారు. గోశాలను పట్టణానికి దూరంగా ఏర్పాటు చేయడంలో గోవులను తరించలేక వదిలేస్తుండడంతో ఈ సమస్య నెలకుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. ఈకార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, సాయికుమార్, సుధాకర్, లక్ష్మణ్, గణేష్‌నాయక్, రాజేంద్రప్రసాద్; పవన్‌కుమార్, సోముశేఖర్, సాయినాథ్ పాల్గొన్నారు.

గజవాహనంపై శ్రీవారు



ధర్మవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో శ్రీలక్ష్మీవెం కటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను సోమవారమూ నిర్వహించారు. ఇందులోభాగంగా విశ్వక్శేశన ఆరాధన, యాగశాల ప్రవేశం, ద్వారాతోరణ, ధ్వజకుంబపూజ, నిత్యశాంతిమూల మూర్తి, గాయత్రి హోమాలను నిర్వహిం చారు. అనంతరం స్వామివారిని గజవాహనంపై ఊరేగించారు. సాయంత్రం రథోత్సవాన్ని చేపట్టారు. ఈ ఉత్సవాల్లో మైసూరు దత్తపీఠ ఉత్తర పీఠాధిపతి దత్త విజయానంద తీర్థస్వామి పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు స్వాధీనం చేయండి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): హిందూపురం రోడ్డులోని గట్లు వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని సీపీఎం నాయకులు డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. టిడ్కో ఇళ్లకోసం రూ. 500, రూ.25వేలు, రూ.50వేల లబ్ధిదారుల వాటాగా డబ్బు కట్టించుకున్నారన్నారు. వెయ్యి మందికిపైగా ఇళ్లు వస్తాయని ఆశతో డబ్బులు చెల్లించారన్నారు. లబ్ధిదారుల వాటా పోనూ మిగిలిన మొత్తాన్ని బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరు చేయించారని, దీంతో బ్యాంకర్లు నెలవారీ కంతులు కట్టాలని లబ్ధిదారులకు నోటీసులు పంపుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఇళ్లు పూర్తి చేసి, లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని, అప్పటివరకు నెలవారీ బ్యాంక్ కంతును ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జగన్మోహన్, ము స్తాక్, రామమోహన్, బాబ్‌జాన్, అంజనేయులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పత్తి చంద్రశేఖర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గోపీనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులు షాజహాన్, రంగప్ప, టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, నిజాం, అల్లాబక్ష, బూదిలి ఓబులరెడ్డి, కంచి సురేష్, సుధాకర్‌రెడ్డి, శ్రీరాములనాయుడు, పాత్రికేయులు పాల్గొన్నారు.

రేపు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

కదిరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఐ రాధిక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు బుధవారం ఉదయం పదిగంటలకు కదిరి ఆర్డీఓ కార్యాలయంలో హాజరుకావాలన్నారు.

క్రైం న్యూస్ ..

మామిడి చెట్లు దగ్ధం


దగ్ధమైన మామిడిచెట్లు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర ఓబనపల్లికి చెందిన చిన్నబాబు, సూర్యనారాయణ, శివన్న, రామచంద్ర తదితర రైతులు సాగుచేసిన మామిడి చెట్లు, డ్రిప్ సోమవారం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈప్రమాదంలో రూ. రెండులక్షలు నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. రైతు చిన్నబాబు మాట్లాడుతూ.. తాను రెండు ఎకరాల్లో మామిడి చెట్లను ఎనిమిది ఏళ్ల క్రితం సాగుచేశానని, మరో రెండు ఎకరాల్లో కూరగాలు, ఇతర అంతర్ పంటల కోసం డ్రిప్ ఏర్పాటు చేశానని తెలిపారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం పూతకొచ్చిన దాదాపు 45 మామిడి చెట్లు, డ్రిప్ పూర్తిగా కాలిపోయిందని, రూ.లక్ష నష్టం జరిగిందని అన్నారు. అలాగే సూర్యనారాయణకు చెందిన పదిమామిడి చెట్లు, శివన్నకు చెందిన 40 మామిడి చెట్లు, రామచంద్రకు చెందిన 30చెట్లు, రమణకు చెందిన ఎకరాలో డ్రిప్, ఓబులేసు పశువుల కోసం సాగుచేసిన గ్రాసం, డ్రిప్, నీటి పైపులైన్లు కాలిపోయినట్లు చెప్పారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కేసు నమోదు

ధర్మవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 8న శివకుమార్ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. సుదర్శన్ కాంప్లెక్స్ వద్ద వెనుకవైపు నుంచి బొలెరా వాహనం వేగంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శివకుమార్ గాయపడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

బాలిక అదృశ్యం

కదిరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె అదృశ్యమైనట్లు పట్టణానికి చెందిన తల్లిదండ్రులు సీఐ నారాయణరెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి 16 సంవత్సరాల బాలిక పదో తరగతి చదువుతోందని, తరచూ పుట్టపర్తిలోని ఆమె అత్త దగ్గరకు వెళ్లేదని తెలిపారు. ఈ క్రమంలో పుట్టపర్తికి చెందిన శివసాయతో పరిచయం ఏర్పడిందని, విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు మందలించారని చెప్పారు. ఈనెల 8న ఉదయం ఐదు గంటలకు ఇంటిలో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటి నుంచి ఆ బాలికి వెళ్లిపోయిందని, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడంపల్లి గ్రామంలో కోదండ రామాలయంలో సీతారామ, లక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని గ్రామపెద్దలు, గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బసవేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో స్వామివారు

రొళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లినమడుగులో వెలిసిన బసవేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ దేవి అమ్మవారికి తమల పాకులు, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఎస్సీ కాలనీవాసులు, ప్రజలు స్వామివారికి తమలపాకుల పూజలు చేయడానికి వెళ్లడంతో కొంత మంది నిరాకరించారు. ఈవిషయమై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించి సోమవారం పూజకు అనుమతి ఇచ్చారు. టి.ఎస్.రమణ, హనుమయ్య, సురేష్‌బాబు, శివరాం, రంగనాథ్, జగన్నాథ్, కాలనీవాసులు, ప్రజలు పాల్గొన్నారు.

స్వీపర్లకు జీతాలు చెల్లించండి

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న కంటింజెంట్ స్వీపర్లకు జీతాలు అందించాలని ఎంజీఎం పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం, మునిసిపల్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాసులు మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేష్‌కుమార్‌ను కోరారు. ఎంజీఎం పాఠశాలలో నులిపురుగుల నివారణ కార్యక్రమానికి హాజరైన ఆయనకు ఏపీఎంటీఎఫ్ తరుఫున వినతి అందించారు. 8 నెలలుగా స్వీపర్లకు జీతాలు రాలేదన్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నామని, వారికి స్నాక్స్ అందించాలని కోరారు. ఛైర్మన్ స్పందిస్తూ ఈ విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయులు రామాంజనేయులు, జగన్, ఐనుద్దీన్ పాల్గొన్నారు.

600 రోజులకు చేరుకున్న అన్న క్యాంటీన్


భోజనం వడ్డిస్తున్న కన్వీనర్ శ్రీరాములు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ సోమవారానికి 600రోజులుకు చేరింది. టీడీపీ కన్వీనర్ శ్రీరాములు మంత్రి సవిత చొరవతో ప్రత్యేకంగా భోజనాలు చేయించారు. ఆయన మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకపోయినా మంత్రి సవిత నిరుపేదల కడుపు నింపాలన్న ధ్యేయంతో క్యాంటీన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుబ్రహ్మణ్యం, రొద్దం నరసింహులు, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఆదిత్యా మెహతా ఫౌండేషన్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న ఫౌండేషన్ డైరెక్టర్ గంగాధర్


హిందూపురం, అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఫోర్బ్స్ ఇండియా దక్షిణ భారత్ 2024 అవార్డులకు ఆదిత్యా మెహతా ఫౌండేషన్ ఎంపికయ్యారు. అంతర్జాతీయ సంస్థ ఫోర్బ్స్ వారు ఏటా నిర్వహించే అవార్డులో మెహతా ఫౌండేషన్‌కు స్థానం దక్కింది. మూడు సంవత్సరాల నుంచి ఈ ఫౌండేషన్ జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయంలలోని దివ్యాంగ విద్యార్థులకు పారా క్రీడల్లో శిక్షణ ఇస్తోంది. ఈ సంస్థ ద్వారా శిక్షణ పొందిన 20 మంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ పారాక్రీడల్లో మెడల్స్ సాధించారు. ఇందుకుగాను కేరళ రాష్ట్రం కొచ్చిలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఆదిత్యా ఫౌండేషన్‌కు అవార్డు దక్కింది. ఫౌండేషన్ ట్రస్టీ జేకే మెహతా, డైరెక్టర్ గంగాధర్ పాల్గొని అవార్డు అందుకున్నారు.

అనధికార కట్టడాలను అడ్డుకున్న అధికారులు


కట్టడాలను అడ్డుకుంటున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను పెనుకొండ నగర పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. సోమవారం పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ముగ్గురు నిర్మాణదారులతో అనుమతులు తీసుకుని కట్టడాలు చేపట్టాలని హెచ్చరించారు. ఇటీవల జర్నలిస్ట్ కాలనీలో మంచినీటి సౌకర్యం కోసం మంత్రి సవిత ఏర్పాటుచేసిన పైప్‌లైన్ సైతం అనధికార కట్టడాల నిర్వాహకులు ధ్వంసం చేశారు. ఇంతవరకు అధికారులు ప్రశ్నించిన పాపానపోలేదు. జర్నలిస్ట్ కాలనీలో అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

కొండకు నిప్పు


కొండపై ఎగసి పడుతున్న మంటలు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరేపల్లి సమీపంలోని కొండకు సోమవారం ఆకతాయిలు నిప్పుపెట్టారు. మంటలు ఎగసిపడుతుండటంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కేసు నమోదు

ధర్మవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 8న శివకు మార్ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. సుదర్శన్ కాంప్లెక్స్ వద్ద వెనుకవైపు నుంచి బొలెరా వాహనం వేగంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శివకుమార్ గాయపడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

వైకుంఠ వాసుడే..

పేట వేంకటరమణ స్వామి ఆలయానికి శతాబ్దాల చరిత్ర

భక్తుల కోసం తరలివచ్చిన తిరుమలేశుడు

వెలసిన క్షేత్రం..!

నేడు కల్యాణోత్సవం


ఆలయ రాజగోపురం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సప్తగిరులపై వెలసిన శ్రీవేంకటేశుడే భక్తుల కోసం తరలివచ్చాడు. తనను భక్తితో కొలిచే వారి కోసం కొలువయ్యాడు. ఆ మహిమాన్విత క్షేత్రమే హిందూపురంలోని పేట వేంకటరమణ స్వామి ఆలయం. క్రీ.శ. 764 సంవత్సరంలో ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. నాటి నుంచి నేటి వరకు వేంకటరమణుడు.. భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్నాడు. తిరుమలకు వెళ్లలేని వారికి దర్శన భాగ్యం కల్పించేందుకు ఆ శ్రీ వేంకటేశుడే ఇక్కడ కొలువైనట్లు కథ ప్రచారంలో ఉంది. అంతటి మహిమాన్విత క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మ రథోత్సవం ఈనెల 12న నిర్వహించనున్నారు. అంతకుముందు రోజు ఈనెల 11న కల్యాణోత్సవం కనులపండువగా చేయనున్నారు. స్వామివారి బ్రహ్మ రథోత్సవానికి వేలాదిగా భక్తులు తరలిరానున్నారు.


స్వామివారి మూలవిరాట్టు

ఆలయ చరిత్ర: లక్ష్మీ వల్లభుడిగా పేట వేంకటరమణుడు కొలువుదీరాడు. వృద్ధ దంపతుల కోర్కెను తీర్చేందుకు తిరుమల నుంచి స్వామి తరలివచ్చి హిందూపురంలోని పేట వేంకటరమణ స్వామి దేవాలయంలో కొలువైనట్లు ఇతిహాసాలు తెలుపుతున్నాయి. హిందూపురాన్ని క్రీ.శ. 764 కాలంలో హిందూరావు అనే మరాఠా సామంత రాజు పాలిస్తుండేవాడు. రాజు తల్లిదండ్రులైన వృద్ధ దంపతులు తిరుమలకు వెళ్లి, స్వామి దర్శనం చేసుకోవాలని తపిస్తుండేవారు. వయసు మీదపడటంతో ఈ జన్మకు స్వామి దర్శనం కాదని ఆవేదన చెందుతుండేవారు. ఎలాగైనా దర్శన భాగ్యం కల్పించు స్వామీ అని స్వామిని వేడుకున్నారు. ఓ రోజు హిందూరావుకు వేంకటేశ్వర స్వామి కలలో కనిపించి, తిరుమలకు వచ్చి తనను దర్శించుకోలేని భక్తుల కోసం హిందూపురంలో ఆలయం కట్టించాలని ఆజ్ఞాపించినట్లు ప్రచారంలో ఉంది. దీంతో ఆయన పేట ప్రాంతంలో ఆలయం నిర్మించగా.. కలియుగ దైవం ఇక్కడ కొలువైనట్లు ఇతిహాసాలు చెబుతున్నాయి. ఆలయంలో 2004 నవంబరు 7వ తేదీన కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి చక్రస్థాపన చేశారు.

టీడీపీ హయాంలో జీర్ణోద్ధరణ: పేట వేంకటరమణ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. 2014లో అప్పటి తెలుగుదేశం హ యాంలో ఆలయాల జీర్ణోద్ధరణ, అభివృద్ధికి ని ధులు కేటాయించింది. పేట వేంకటరమణుడి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేశారు. వేల సవంత్సరాల క్రితం ప్రతిష్ఠించిన విగ్రహం నేటికీ చెక్కు చెదరకుండా ఉంది.

నేడు శ్రీవారి కల్యాణోత్స వేడుకలు: మాఘ శుద్ధ చతుర్థశి మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణం సాయంత్రం 6 గంటలకు జరుగన్నాయి. ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, 6.30కు తిరుమంజనసేవ, 7.30కు ప్రాకారోత్సవం, 8 గంటలకు దీపోత్సవం, 1 గంటకు బ్రాహ్మణులకు అన్నతర్పణం ఉంటుంది.

12న బ్రహ్మ రథోత్సవం: మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7.30కి ప్రాకారోత్సవం మధ్యాహ్నం 2 గంటలకు శ్రీదేవి, భూదేవి పమేత శ్రీ వేంకటరమణుడు రథంలో ఊరేగనున్నారు.

ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోండి: ఏఓ

సోమందేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి రైతు ఆర్బీకేలో తప్పనిసరిగా ఫార్మర్ ఐడీని నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కవితా రాణి సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇస్తారన్నారు. వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా రైతులకు అందించడానికి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. రైతు గుర్తింపు సంఖ్యను రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదు చేయడంద్వారా ప్రభుత్వ పథకాలు రాయితీలు, ఇతర వ్యవసాయ సంబంధితసేవలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనుమతులు తప్పనిసరి

సోమందేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా చీటీలు నడిపినా, అధిక వడ్డీలు వసూలు చేసినా అలాంటివారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సోమవారం ఎస్‌ఐ రమేష్ హెచ్చరించారు. మండలంలో అనేకమంది అక్రమంగా చీటీలు నడుపుతూ డబ్బులు చెల్లించకుండా వేధిస్తున్నట్లు తమదృష్టికి వచ్చిందన్నారు. చిరు వ్యాపారులు, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వడ్డీవ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేస్తూ మానసిక వేదనకు గురిచేస్తున్నట్లు తెలిపారు. అలాంటి వారు తమ పద్ధతులను మార్చుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుడిబండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో చదివేందుకు అడ్మిషన్ల కోసం విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఎంజేపీ కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాల్ కోరారు. 15 నుంచి మార్చి 15వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంజేపీ గురుకుల పాఠశాలలో 5వతరగతి ప్రవేశం కోసం, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చేరేందుకు అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజా ఫిర్యాదులపై స్పందించండి : ఎస్పీ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరి ష్కార వేదికకు వచ్చే ప్రజాఫిర్యాదులపై సత్వరమే పరిష్క రించాలని ఎస్పీ వి.రత్న సంబంధిత పోలీసు అధికారులను ఆదేశిం చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ మొత్తం 58 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్బీసీఐ బాలసు బ్రహ్మణ్యంరెడ్డి, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

● పుట్టపర్తిటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా రెవెన్యూ అధికారి విజయసారధి మొత్తం 125 అర్జీలను స్వీకరించారు. సకాలంలో అర్జీలను పరిష్కరించాలని, గడువు దాటితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

మామిడి చెట్లు దగ్ధం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలం లోని వీర ఓబనపల్లికి చెంది న చిన్నబాబు, సూర్యనారా యణ, శివన్న, రామచంద్ర తదితర రైతులు సాగుచేసిన మామిడి చెట్లు, డ్రిప్ సోమ వారం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈప్రమా దంలో రూ. రెండులక్షలు నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. రైతు చిన్నబాబు మాట్లాడుతూ.. తాను రెండు ఎకరాల్లో మామిడి చెట్లను ఎనిమిది ఏళ్ల క్రితం సాగుచేశానని, మరో రెండు ఎకరాల్లో కూరగాలు, ఇతర అంతర్ పంటల కోసం డ్రిప్ ఏర్పాటు చేశానని తెలిపారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం పూతకొచ్చిన దాదాపు 45 మామిడి చెట్లు, డ్రిప్ పూర్తిగా కాలిపోయిందని, రూ.లక్ష నష్టం జరిగిందని అన్నారు. అలాగే సూర్యనారాయణకు చెందిన పదిమామిడి చెట్లు, శివన్నకు చెందిన 40 మామిడి చెట్లు, రామచంద్రకు చెందిన 30చెట్లు, రమణకు చెందిన ఎకరాలో డ్రిప్, ఓబులేసు పశువుల కోసం సాగుచేసిన గ్రాసం, డ్రిప్, నీటి పైపులైన్లు కాలిపోయినట్లు చెప్పారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

గుడిబండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ డాక్టర్ శాంత లక్ష్మి, ఆర్డీటీ మడకశిర రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, సీడీపీఓ నాగమల్లేశ్వరి కోరారు. సోమవారం గుడిబండ మండలం ఆలదపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థినుల తల్లిదండ్రులు బాల్యవివాహం చేయడం చట్టరీత్యా నేరం అన్నారు. బాల్య వివాహాలు నిర్వహిస్తే అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. బాల్య వివాహాలు చేసేవారు, అందుకు సహకరించిన వారికి రెండు సంవత్సరాల జైలుశిక్ష, లేక రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు భారతి, సూపర్‌వైజర్ కమలమ్మ, ఆర్డీటీ మహిళా అభివృద్ధి విభాగం టీమ్ లీడర్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు లక్ష్మి, మంజుళ, అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతి, లక్ష్మి పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించండి

పావగడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యాప్తంగా గ్రామ కార్యదర్శులుగా పనిచేస్తున్న రెవెన్యూ అధికారులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరాహారదీక్ష చేపట్టారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారులకు మరింత ఒత్తిడి పెరిగిందని మీడియా అసోసియేషన్ సంఘం అధ్యక్షులు రాజేష్ అన్నారు. గ్రామాల పరిధిలో రైతులకు అనుకూలంగా పనిచేయాల్సి వస్తుందని అక్కడ సరైన వసతి సౌకర్యాలు, గదులు లేక ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, మొబైల్‌లు ప్రభుత్వం అందించకుండానే పథకాలను అభివృద్ధి పరచాలని తమకు ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. తమకు సౌకర్యాలు కల్పిస్తే ఎన్నిపనులైనా చేస్తామన్నారు. ఉపాధ్యక్షులు రఘువీర్, కార్యదర్శి తిమ్మారెడ్డి, కోశాధికారి రఘునాథ్ రెడ్డి, రెవెన్యూ కార్యదర్శులు రవి, రంజిత్ తదితరులు తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం అందించారు.

ప్రభుత్వ భూముల పరిశీలనకు దరఖాస్తులు

పరిగి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఆక్రమాలకు గురైన ప్రభుత్వ భూముల పరిశీలనకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ హసీనాసుల్తానా ఒక ప్రకటనలో కోరారు. నిరుపేద కుటుంబాలకు ఉపశమనం అందించడం, ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం-2025 ప్రారంభించి, ప్రభుత్వ ఉత్తర్వుల జీవో30 ప్రకారం 2019 అక్టోబరు 15కి ఆర్‌సీసీ లేదా పైకప్పులతో, ఇటుక గోడలతో ఆక్రమించిన భూములను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించినట్లు తెలిపారు. మహిళా లబ్ధిదారులపై భూమిపట్టా జారీచేసి ఆమోదం పొందిన రెండు సంవత్సరాల తరువాత యాజమాన్య హక్కులు మంజూరు చేస్తారు. మీసేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులను అందజేయవచ్చని తహసీల్దార్ తెలిపారు.

అబాకస్ పోటీలకు బ్రిలియన్స్ విద్యార్థి ఎంపిక


విద్యార్థి జయ్‌తేజ్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న అతిథులు

పెనుకొండ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోటీల్లో అబాకస్ పోటీలకు బ్రిలియన్స్ విద్యార్థి జయ్‌తేజ్ ఎంపికైనట్లు హెచ్‌ఎం నాగవేణి తెలిపారు. జాతీయస్థాయిలో అబాకస్ లెవెల్-3 పోటీలు విజయవాడలోని విశ్వం ఎడుటెక్ ఆధ్వర్యంలో నిర్వహించారన్నారు. పోటీల్లో 4వ తరగతి విద్యార్థి జయ్‌తేజ్ ద్వితీయబహుమతి సాధించాడు. హైదరాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఈ విద్యార్థి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు జయ్‌తేజ్ అభినందించారు.

పిల్లల ఆరోగ్యమే.. దేశ సౌభాగ్యం

● హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్


హిందూపురంలో విద్యార్థినికి ఆల్బెండజోల్ వేస్తున్న చైర్మన్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యమే దేశ సౌభాగ్యమని మున్సిపల్ ఛైర్మన్ డి.ఇ. రమేష్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైద్య ఆరోగ్యశాఖ ఇమ్యునైజేషన్ అధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నులిపురుగుల నివారణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పాఠశాల స్థాయి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యులు ఆనంద్‌బాబు, మంజుశ్రీ, హెచ్‌ఎం సామ్రాజ్యం పాల్గొన్నారు.

● సోమందేపల్లి: మండల కేంద్రంలో సోమవారం విద్యార్థులకు వైద్యులు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో వైద్యులు హరికుమార్, ఓంకార్‌లు విద్యార్థులకు మాత్రలు మింగించారు. మనోహర్‌రెడ్డి, రవీంద్ర, రత్నమ్మ, ఏఎన్‌ఎం శారద పాల్గొన్నారు.

● గోరంట్ల: మండలంలోని 7,150 మంది పిల్లలకు వైద్య ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను సోమవారం మింగించారు. గోరంట్ల ఎమ్మార్సీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో డాక్టర్ శృతి, డీపీఎం నాగరాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీహెచ్‌ఈఓ రమణ, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి, ఎంపీహెచ్‌ఏలు రంగనాథ్, గాయత్రి, సువర్ణ పాల్గొన్నారు.

● చిలమత్తూరు: ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వలన ఆరోగ్యవంతంగా ఉండొచ్చని డాక్టర్ రామక్రిష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. సీహెచ్‌ఓ జయచంద్రకుమార్, టీడీపీ నాయకులు నాగేంద్ర, అశ్వత్థప్ప, బ్రహ్మానందరెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

● అగళి: ప్రతి చిన్నారికి నులిపురుగుల మందులు వేయాలని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు సూచించారు. ఇనగలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆయన నులిపురుగుల మందులను వేశారు. వైద్యులు శివానందగాయిత్రి, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెనుకొండ: పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు వాడాలని జిల్లా క్షయ, కుష్ఠివ్యాధి నివారణ అధికారి డా.తిప్పయ్య సూచించారు. సోమవారం పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు అంగనవాడీ కేంద్రాల్లో పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు హఫీజ్, శంకర్‌నాయక్, శ్రీలేఖ పాల్గొన్నారు.


హేమావతిలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల

అభివృద్ధి పనుల ప్రారంభం

అమరాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి బోరును, సీసీ రోడ్డు, గోకులంషెడ్డులను ఎమ్మెల్యే టీటీడీ పాలక మండలి సభ్యులు ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గోకులం షెడ్లను రాయితీతో ఇస్తోందని వారు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసమూర్తి, ఎంపీడీఓ రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనూనాయక్, ఏఈ హరీష్, మండల కన్వీనర్ గణేష్, ఎస్సీ సెల్ జయకుమార్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, రామచంద్రప్ప, కుమారస్వామి, మారుతీప్రసాద్, శివరుద్రప్ప, సర్పంచి తిప్పేస్వామి, జడ్పీటీసీ స్వారక్క, దాదావీర్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి: హేమావతి గ్రామంలో 26వతేదీన నిర్వహించే హెంజేరు సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు ఆదేశించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి హేమావతి గ్రామంలో సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై వారు గ్రామస్థులతో సమీక్ష నిర్వహించారు. ఎక్కడా ఎ లాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: పీడీ


సర్టిఫికెట్లతో అభ్యర్థులు, పీడీ నరసయ్య, అధికారులు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి శిక్షణ పూర్తి చేసుకోవడం వల్ల మహిళలు నిరుద్యోగులు అన్ని రంగాల్లో రాణించవచ్చని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య అన్నారు. సోమవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇచ్చిన శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసుకొన్న వారికి సర్టిఫికెట్‌లను అందజేశారు. పీడీ మాట్లాడుతూ శిక్షణలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారు కావడానికి కావాల్సిన మెలకువలు, వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాల గురించి శిక్షణ ఇస్తున్నట్ల తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణతోపాటు పలువురు కోఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.

మినిట్ వర్కర్లను గుర్తించండి

మినిట్ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని స్పందన కార్యక్రమానికి విచ్చేసిన ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మికి సిబ్బంది వినతిపత్రం అందించారు. తమసమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వాలను గద్దె దించాలి


ధర్నాలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు

పావగడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతు వ్యతిరేకత చట్టాలను రద్దుచేస్తామని చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దెదించాలని సోమవారం తహసీల్దార్, విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట రైతు సంఘం నాయకులు ధర్నా చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప మాట్లాడుతూ రైతుకు అవసరమైన ఎంఎస్‌పీ పద్ధతిని చట్టపరం చేయాలని, విద్యుత్‌శాఖను ప్రైవేటీకరణ కాకుండా చట్టబద్ధం చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు ఆర్థిక సాయం


బాధితులకు చెక్కులను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువుల వల్ల నష్టపోయిన ముగ్గురు రైతులకు కలెక్టర్ చేతన్, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి సోమవారం ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన స్పందన కార్యక్రమంలో వన్యప్రాణుల వల్ల పశువులు, గొర్రెలు, మేకలను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, అటవీ శాఖ అధికారి చక్రపాణి పాల్గొన్నారు.

కార్మికులకు అవగాహన


కోనాపురంలో ఈశ్రామ్ కార్డు నమోదు చేస్తున్న లేబర్ కమిషనర్ సత్యనారాయణ

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఈశ్రామ్ కార్డుపై కార్మికులకు అవగాహన కల్పించినట్లు లేబర్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని కోనాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ప్రత్యేక బీమా పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈశ్రామ్ కార్డు పొందిన కార్మికులకు ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. అనంతరం కార్మికులకు ఈశ్రామ్ కార్డు రిజిస్ట్రేషన్ ప్రారంభించారు.

కార్మికులకు అన్ని హక్కులు కల్పించాలి

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కియ అనుబంధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు అన్ని హక్కులు కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కియ అనుబంధ పరిశ్రమలో పనిచేసే ఉద్యోగ కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ వారికి అవగాహన కల్పించారు. రమేష్ మాట్లాడుతూ ఇక్కడ పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు సరైన జీతాలు, ఈఎస్‌ఐ, పీఎఫ్, బోనస్‌లు అందలేదన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి, బాబావలి, తిప్పన్న పాల్గొన్నారు.


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సీఐటీయూ నాయకులు